

కప్పరాడ ప్రగతినగర్ వద్ద రాత్రి 8.30 గంటలకు క్యూలో ఓటర్లు



ఆరిలోవలో ఓటు వేసేందుకు బారులుతీరిన జనం

ఓటు ఉత్సాహం

రామ్‌నగర్ విశాఖ సేవా సదన్ పాఠశాలలో ఓటు వేసిన అనంతరం యువతులు

ఓటింగ్ ఆలస్యం

- ఉదయం ఓటు వేయడానికి రెండు నుంచి మూడు గంటలకు పైగా క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి
- సిబ్బందికి తగిన శిక్షణ లేకపోవడమే కారణం
- వేచి ఉండలేక వెనుతిరిగిన వృద్ధులు, మహిళలు
- జిల్లాలో పలుచోట్ల రాత్రి తొమ్మిది గంటల వరకూ కొనసాగిన ఓటింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం చాలా ఆలస్యంగా ప్రారంభమై... చివరి వరకూ అదే పంథాలో కొనసాగింది. దీంతో ఓటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒక ఓటు వేయించడానికి ఏడు సెకండ్ల సమయం తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్దేశించగా అత్యధిక పోలింగ్ బూత్‌లలో కనీసం నాలుగైదు నిమిషాల సమయం తీసుకున్నారు. దీనివల్ల గంటకు సగటున 20 మందికి మించి ఓటింగ్ చేయలేకపోయారు. ఎండ తీవ్రంగా ఉండడం, క్యూలైన్లు భారీగా పెరిగిపోవడం, ఉక్కపోత, తదితర సమస్యలతో చాలా మంది వృద్ధులు, మహిళలు ఉదయం పదకొండు గంటల సమయంలో ఓట్లు వేయకుండానే తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు.

ఉదయం ఓటింగ్ ప్రక్రియ ఆలస్యమవడంతో అసహనంతో తిరిగి వెళ్లిపోయినవారు సాయంత్రం నాలుగు గంటల తరువాత మళ్లీ వచ్చినా, అదే పరిస్థితి ఎదురైంది. క్యూలైన్లు వేగంగా కదలకపోవడంతో ఎక్కువసేపు నిల్చోవాల్సి వచ్చింది. పోలింగ్ బూత్‌లలో ప్రక్రియ వేగవంతం చేసేందుకు పర్యవేక్షకులు లేకపోవడం, ఉన్న కొద్దిమందీ పట్టించుకోకపోవడంతో చాలామంది ఓటు వేయకుండానే తిరుగుముఖం పట్టారు. వాస్తవానికి ఈసారి యువతకు పెద్దసంఖ్యలో ఓటు హక్కు లభించింది. వారంతా ఓటు వేయాలని ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. కానీ పరిస్థితులు సహకరించలేదు. జిల్లాలో సాయంత్రానికి 70 శాతం వరకు ఓటింగ్ జరగాల్సి ఉండగా అధికారుల నిర్లిప్తత, పర్యవేక్షణ లోపంతో తగ్గిపోయింది. నగరంలో అధికశాతం పోలింగ్ బూత్‌ల వద్ద ఓటు వేయడానికి ఒక్కొక్కరికి మూడు గంటలకుపైగా సమయం పట్టింది. ఇది చాలా ఎక్కువని, పోలింగ్ సిబ్బందికి సరైన శిక్షణ, ప్రక్రియ వేగవంతంపై అవగాహన, సరైన పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఫలితంగా సాయంత్రం ఆరు గంటలతో ముగియాల్సిన పోలింగ్ రాత్రి తొమ్మిది గంటలు దాటినా కొనసాగించాల్సి వచ్చింది.

మొరాయించిన ఓటింగ్ యంత్రాలు

జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఓటింగ్ యంత్రాలు మొరాయించాయి. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభించాలని సిబ్బంది యత్నించినా యంత్రాలు పనిచేయక కొన్నిచోట్ల గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా ప్రక్రియ ప్రారంభమైంది. ఉత్తర నియోజకవర్గంలోని 54వ వార్డులో 1, 2 ఈవీఎంలు 9.15 గంటల వరకు పనిచేయలేదు. దాంతో అక్కడ గొడవలు జరిగాయి. ఇదే నియోజకవర్గం సింగరాయమెట్ట 246 బూత్‌లో ఈవీఎంలు సక్రమంగా పనిచేయక మహిళలు రాత్రి ఏడు గంటల వరకు క్యూలోనే ఉండిపోయారు. వారికి టాయ్‌లెట్లు, తాగునీటి వసతి లేకపోవడంతో అవస్థలు పడ్డారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలోని కృష్ణా కాలేజీలో పక్కపక్కనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఓటర్లు క్యూలో నిల్చోవడానికి స్థలం సరిపోలేదు. దీంతో తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఇక్కడి 216 పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ నత్తనడకన సాగింది. రాత్రి ఏడు గంటల తరువాత కూడా జనం భారీగా క్యూలైన్లలో వేచి ఉన్నారు.

జిల్లాలో 65.57 శాతం పోలింగ్

- విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 66.14 శాతం
- ఉదయం ఆరున్నర గంటలకే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు
- ఎండను సైతం లెక్కచేయకుండా బారులుతీరిన వైనం
- క్యూకట్టిన వృద్ధులు, మహిళలు
- పోలింగ్ నిర్వహణలో సిబ్బంది వైఫల్యం
- ప్రతిచోట గంటలకొద్దీ నిరీక్షణ
- కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయింపు
- కొన్నిచోట్ల రాత్రి 11 గంటల వరకూ కొనసాగిన పోలింగ్

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 6.30 గంటలకే ఓటర్లు బారులు తీరారు.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు రాత్రి పన్నెండు గంటల సమయానికి 64.02 శాతం పోలింగ్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. అదే విశాఖ పార్లమెంటు నియోజక వర్గానికి చూస్తే 66.14 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఉదయం నుంచి ఓటర్లు భారీగా కేంద్రాలకు ... మిగతా 6వ పేజీలో



నియోజకవర్గాల వారీగా పోలైన ఓటింగ్ శాతం

నియోజకవర్గం	ఉదయం 9 గంటలకు	11 గం.కు	ఒంటిగంటకు	3 గం.కు	5 గం.కు	రాత్రి 12 గం.కు
భీమిలి	7.91	21.80	32.61	48.98	60.67	71.14
విశాఖ తూర్పు	9.4	23.01	37.51	50.41	60.53	68.5
విశాఖ దక్షిణ	4.83	17.22	31.11	41.91	53.31	62.64
విశాఖ ఉత్తర	13	17.00	30.00	40	54	61.52
విశాఖ పశ్చిమ	11.2	25.02	36.40	50.62	56.49	65.05
గాజువాక	17.23	21.65	38.02	45.85	58.23	64.93
పెందుర్తి	6.59	17.57	30.03	43.8	56.5	65.24



సోమవారం రాత్రి 7 గంటలకు పెదజాలారిపేట వద్ద కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు. - మరిన్ని ఫొటోలు I పేజీలో



చినవాల్తేరు విద్యానగర్ కాలనీలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న కలెక్టర్ మల్లికార్జున



స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పోలింగ్ పూర్తయిన వెంటనే ఈవీఎంలను ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. అయితే రాత్రి పది గంటల తరువాత కూడా సుమారు 20 కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. ఆయా ఈవీఎంలు తరలింపునకు మరో రెండు గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేశారు. కాగా ఈవీఎంలు తీసుకు వచ్చే సిబ్బంది కోసమని ఏయూలో భోజనాలు ఏర్పాటుచేశారు. అయితే పలుచోట్ల పోలింగ్ ఆలస్యం కావడంతో వారంతా కేంద్రాల్లోనే ఉండిపోయారు. తమకు భోజనాలు లేదా అల్పాహారం అందించడంలో అధికారులు విఫలమయ్యారని ఆయా కేంద్రాల సిబ్బంది అసంతృప్తి వ్యక్తంచేశారు. సోమవారం రాత్రి 11.30 గంటల వరకు జిల్లాలో 70 కేంద్రాల్లో పోలింగ్ లేదా పోలింగ్ ముగిసిన తరువాత సీల్ చేయడం వంటి ప్రక్రియ పూర్తికాలేదు.



నిర్మానుష్యంగా ఆశీలమెట్ట-జగదాంబ జంక్షన్ రహదారి

బోసిపోయిన నగరం

విద్య, ఉద్యోగ, వ్యాపారం నిమిత్తం నగరంలో నివాసం ఉంటున్న పలువురు ఓటు హక్కు వినియోగించుకునేందుకు శని, ఆదివారాల్లో స్వస్థలాలకు వెళ్లిపోయారు. దీంతో సోమవారం నగరమంతా బోసిపోయినట్టు అయింది. నిత్యం వాహనాల రాకపోకలతో కిటకిటలాడే రహదారులు, కూడళ్ల నిర్మానుష్యంగా దర్శనమిచ్చా. పోలింగ్ కేంద్రాల వద్ద తప్ప బయట ఎక్కడా జనాలు కనిపించలేదు. చిన్నా, పెద్ద దుకాణాలన్నీ మూతపడ్డాయి.

- విశాఖపట్నం



నగరంలో వర్షం

నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. సాయంత్రం ఆరు గంటల తరువాత చిరు జల్లులు ప్రారంభమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో భారీవర్షం పడింది. పెద్దఎత్తున గాలులు వీయడంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన టెంట్లు గాలులకు నేలకూలాయి. ఓటేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు ఇబ్బందిపడ్డారు. వర్షం కురుస్తున్నా అలాగే క్యూలో ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- విశాఖపట్నం

ఎవరి ధీమా వారిది!

గెలుపుపై కూటమిలో సంపూర్ణ విశ్వాసం

- ఎంపీ అభ్యర్థికి లక్ష మెజారిటీ వస్తుందంటున్న టీడీపీ నేతలు
- జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరింటిలో గెలుపు ఖాయమని లెక్కలు
- మూడు అసెంబ్లీ సెగ్మెంట్లపై ఆశలు పెట్టుకున్న వైసీపీ
- ఎంపీ అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్



ఎం.శ్రీభరత్



బొత్స ఝాన్సీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం ముగిసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల్లో రాత్రి పది గంటలు దాటిన తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. బరిలో కాంగ్రెస్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు ఎందరు ఉన్నా పోటీ ప్రధానంగా కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ), వైఎస్ఆర్‌సీపీల మధ్యే జరిగింది. పోలింగ్ సరళిని చూసి ఏ పార్టీకి ఆ పార్టీ తమదే విజయమని ధీమా వ్యక్తం చేస్తోంది. ఈసారి కొత్తగా ఓటు హక్కు చాలామందికి వచ్చిందని, యువతరం అంతా చంద్రబాబునాయుడుపై నమ్మకంతో కూటమికే ఓట్లు వేశారని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు అంతా అధికార పార్టీ విధానాలతో విసుగెత్తిపోయి ఉన్నారని, వారంతా కూటమి వెంటే ఉన్నారని చెబుతున్నారు. అయితే మహిళలు పెద్దఎత్తున పోలింగ్‌కు తరలి వచ్చారని, అలాగే వృద్ధులు కూడా ఓపిక చేసుకొని వచ్చారని, వారి ఓట్లు తమకే పడతాయిని వైసీపీ భావిస్తోంది.



విశాఖ ఎంపీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కనీసం 50 వేల నుంచి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ అభ్యర్థులకు రెండు పార్టీలలోను క్రాస్ ఓటింగ్ జరిగినట్టు సమాచారం. భీమిలి, గాజువాక, విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో కొందరు ఓటర్లు ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక పార్టీకి ఓటు వేసి, ఎంపీ అభ్యర్థికి వేరే పార్టీకి వేసినట్టు ప్రచారం జరుగుతోంది. నగరంలో చాలామంది వైసీపీ అభిమానులు ఎమ్మెల్యే ఓటు ఆ పార్టీకే వేసి ఎంపీ ఓటు టీడీపీకి వేసినట్టు చెబుతున్నారు.

విశాఖ తూర్పులో హోరాహోరీ

విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు కనీసం 20 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి నాలుగోసారి విజయం సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎంవీవీ సత్యనారాయణకు ఓటమి చరిత్ర లేదని, ఆయనే తూర్పులో విజయం దక్కించుకుంటారని ఆయన వర్గం ... మిగతా 6వ పేజీలో



రామ్‌నగర్‌లోని విశాఖ సేవాసదన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఓటేసిన టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, ఆయన భార్య తేజస్విని


మాధవధార స్కూల్లో పోటెత్తిన ఓటర్లు


ఓటు వేసిన ఉత్తరం బీజేపీ, వైసీపీ అభ్యర్థులు విష్ణుకుమార్‌రాజు, కేకే రాజు


పోలింగ్ కేంద్రం సందర్శించిన దక్షిణం వైసీపీ అభ్యర్థి వాసుపల్లి


వృద్ధురాలితో మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి వంశీకృష్ణ

'ఓటె'త్తిన ఉత్సాహం

- ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో బారులుతీరిన ఓటర్లు
- ఉదయం 10 తర్వాత పుంజుకున్న పోలింగ్
- ఎండలో సైతం నిరీక్షించి మరీ ఓటేసిన జనం

సీతమ్మధార, మే 13: ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఓటర్లు పోటెత్తారు. పలుచోట్ల ఓటర్లు గంటల తరబడి క్యూలో నిల్చొని మరీ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. నక్కవానిపాలెం, మద్దిలపాలెం జీవీఎంసీ పాఠశాల, ఎన్ఎంసిహెచ్ జీవీఎంసీ పాఠశాల, శారదా విద్యానిలయం, సీతమ్మధార ఆర్అండ్‌బీ వద్ద కేంద్రం, వీబీవీ పాఠశాల, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, సీతంపేట రాజేంద్రనగర్ జీవీఎంసీ పాఠశాల, మధురానగర్ జీవీఎంసీ పాఠశాల, వీటీ కాలేజీ,బీవీకే కళాశాలల్లో పోలింగ్ బూతుల వద్దకు ఉదయంనుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటర్లు ఉత్సాహంగా వచ్చారు. తర్వాత తాకిడి తగ్గింది. ఎన్ఎంసీహెచ్ స్కూల్, మధురానగర్ జీవీఎంసీ పాఠశాల, బీవీకే కళాశాలలో సాయంత్రం ఆరు గంటలు దాటిన జనం పెద్ద ఎత్తున బారుతీరాయి.

వీబీవీ హైస్కూల్‌లో మొరాయించిన ఈవీఎంలు

ఆయా సెంటర్‌లో ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. గురుద్వార వద్ద గల వీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల్లో రెండు ఈవీఎంలు మొరాయించడంతో గంట వరకు ఓటింగ్‌ఆలస్యమైంది. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు, జైభారత్ పార్టీ అభ్యర్థి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అక్కయపాలెంలో స్వల్ప ఘర్షణలు

అక్కయ్యపాలెం, మే 13: ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ కాస్త ఆలస్యమైంది. హైదరాబాద్, చెన్నై, విజయవాడ ప్రాంతాల నుంచి ఓటర్లు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా దివ్యాంగులు, వయో వృద్ధులకు వీల్‌చైర్లలో వచ్చి ఓట్లు వేశారు. గేటర్ 44వ వార్డు కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్ బూత్ బయట వైసీపీ కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు, టీడీపీ, బీజేపీ నాయకులు వేర్వేరుగా ఆయా పార్టీల గుర్తులకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న సమయంలో ఇరు పార్టీల నాయకులకు వాగ్వాదం జరిగింది. పోలీసులు వచ్చి సర్దుబాటు చేశారు. టీడీపీ కార్యకర్త జాగారపు శ్రీనివాస్‌ను పోలీసులు వాహనంలో ఎక్కించి తర్వాత వదిలేశారు. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ బూత్ ఎదుట, శంకువానిపాలెంలోని పోలింగ్ బూత్‌ల వద్ద వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు కలుగ జేసుకోవాల్సి వచ్చింది. జ్ఞాననికేతన్ పాఠశాల, కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల్లో గేటు మూసివేసి సాయంత్రం 6 గంటల వరకు లోపల ఉన్న వారిని మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించారు. బీజేపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పి.విష్ణుకుమార్ రాజు, కేకేరాజు ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్‌జీజీఓస్ కాలనీ పాఠశాలలోని బూత్‌లో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ తన ఓటును వేశారు. పోలింగ్ బూతుల ఎదుట సచివాలయం ఉద్యోగులు ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేసి ఓటర్ల ఓటర్ కార్డులను స్కాన్ చేసి వారి ఓటు ఎక్కడ ఉందో చెప్పారు. భీమిలీ నియోజకవర్గం గ్రేటర్ 45వ వార్డు సత్యసాయినగర్‌లో ఏర్పాటు చేసిన 231 నంబర్ బూత్‌లో 1497 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం ఆరు తర్వాత కూడా పోలింగ్ సాగింది.

47, 48, 54, 55 వార్డుల్లో...

కంచరపాలెం, మే 13: ఉత్తర నియోజక వర్గం పరిధి 47, 48, 54, 55 వార్డుల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఉదయం ఏడు నుంచి 9గంటల వరకు కొంచెం మందకొడిగా పోలింగ్ జరిగినా తరువాత పుంజుకుంది. ఎండను సైతం లెక్క చేయకుండా మహిళలు క్యూలో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధర్మానగర్, రాంజీ ఎస్టేట్ స్కూల్, స్టీల్‌సిటీ స్కూల్,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బర్మాక్యాంప్‌లో ఉన్న కె.కాలనీ స్కూల్లో పోలింగ్ కేంద్రాలకు ప్రజలు బారులుతీరారు. చిన్న పిల్లల తల్లులు,వృద్ధుల కోసం అసౌకర్యంలేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ 47,48వ వార్డుల సరిహద్దులో ఉన్న రాంజీఎస్టేట్ ప్రాథమిక పాఠశాల్లో సాయంత్రం 6గంటలకు సుమారు 300 మంది క్యూలో నిల్చొని ఉండడంతో కాస్త గందరగోళ పరిస్థితి నెలకొంది. కలెక్టరు డా.ఎ.మల్లికార్జున వచ్చి ఈ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. క్యూలోని వారందరికీ కూపన్లు పంపిణీ చేసి పోలింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో రాత్రి దాదాపు 8గంటల వరకు పోలింగ్ ముగిసింది. వార్డుల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

సిరిపురం: ఆంధ్రయూనివర్సిటీ ఇంజనీరింగ్ క్యాంపస్ 221వ బూత్‌లో జైభారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ తన సతీమణి ఊర్మిళతో కలిసి మధ్యాహ్నం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ఈవీఎం సక్రమంగా పనిచేయకపోవడంతో తెరిగి వెళ్లిన వారు మధ్యాహ్నం వచ్చి ఓటు వేశారు. అత్యధిక మంది తమ ఓటుహక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగం కావాలన్నారు.

31వ వార్డులో ప్రశాంతంగా పోలింగ్

ఈవీఎంలు మొరాయింపులపై ఆగ్రహం


ఎన్ఎంసీహెచ్ జీవీఎంసీ స్కూల్ ఎదుట నిరీక్షిస్తున్న ఓటర్లు

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గం జై భారత్ పార్టీ అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణ ఈవీఎంలు మొరాయించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీడీ కాలనీ వీబీవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈవీఎంలు సరిగా పనిచేయక ఓటర్లు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటింగ్ తీరును పరిశీలించడానికి వచ్చిన లక్ష్మీనారాయణ వారు దృష్టికి తీసుకురావడంతో పోలింగ్ బూత్‌ల్లో అధికారులను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఉదయంనుంచి వృద్ధులు , మహిళలు క్యూ నిల్చొని ఉండడంతో ఎండకు ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తంచేశారు.

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి 31వ వార్డు పరిధిలోని ప్రేమ సమాజం ప్రాథమిక స్కూల్, జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల, ద్వారకా బజార్, ప్రభుత్వ వుమెన్ కాలేజీ ప్రాంతంలోని పలు బూత్‌ల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ప్రేమ సమాజం స్కూల్‌లో ఓటర్లు ఎండలో నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో పలువురు ప్రజలు వెనుతిరుగుతుండటంతో వెంటనే సంబంధిత అధికారులు స్పందించి టెంట్‌లో నీడ ఉన్న చోటికి క్యూలైన్‌లను మార్పుచేశారు. సాయంత్రం వేళలో పోలింగ్ కేంద్రాలకు అధిక సంఖ్యలో రావడం కనిపించింది. వృద్ధులకు ఇతరులకు సైతం క్యూలైన్‌లో ఉన్నవారికి సైతం నీటిని సరఫరా చేశారు. వృద్ధులను వీల్‌చైర్‌లో తీసుకొచ్చి ఓటు హక్కు త్వరితగతిన వేసేలా ఏర్పాట్లు చేశారు.

ప్రేమ సమాజం పోలింగ్ బూత్‌ను సందర్శించిన వంశీకృష్ణ

ప్రేమ సమాజం పోలింగ్ బూత్‌ను జనసేన దక్షిణం అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్‌సాయంత్రం సందర్శించారు. ఓటర్లకు ఏమైనా ఇబ్బందులున్నాయా...లేదా అని అడిగి తెలుసుకున్నారు. వీల్‌చైర్‌లోని ఓటేసేందుకు వచ్చిన వృద్ధురాలిని పలకరించి అక్కడ నుంచి వెనుతిరిగారు.ఉదయం వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సందర్శించి ఓటర్లకునమస్కరించారు. ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సైతం వచ్చి సందర్శించి వెళ్లారు.

31వ వార్డు పరిధిలో ..

జీవీఎంసీ 31వ వార్డు పరిధిలోని పోలింగ్ 70,71, 72, 88, 91, 92, 199, 200 నుంచి 216 బూత్‌లు డాబాగార్డెన్స్, గొల్లలపాలెం, చాకలిపేట, బ్యాంక్ కాలనీ, లలితాకాలనీల్లో ఓటర్లు భిన్నంగా వేసినట్టు సమాచారం. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు వరకు కూటమి అభ్యర్థి గాజుగ్లాస్‌కు ఎక్కువగా ఓట్లు పోలయినట్టు సమాచారం. తరువాత వైసీపీకి కొంత మేరకు అనుకూలంగా కనిపించింది. యువత, మహిళలు, వృద్ధుల్లో పలువురు కూటమివైపు మొగ్గుచూపినట్టు సమాచారం. 31వ వార్డులోని ప్రత్యేకంగా తొలి నుంచి టీడీపీమంచి ఓటింగ్ బ్యాంక్ ఉంది. దీని ఆధారంగా గాజుగ్లాస్‌కు ఓట్లువేసినట్టు తెలుస్తోంది.

జ్ఞానాపురం: దక్షిణ నియోజకవర్గం పరిధిలోని 41, 32, 33, 34వ వార్డు పరిధిల్లోని జ్ఞానాపురం, అల్లిపురం, నీమ్మవేపచెట్టు, వెంకటేశ్వరమెట్ట, కొబ్బరితోట, నేరెళ్ల కోనేరు ప్రాంతాల్లో స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం 11గంటల వరకు మందకొడిగా ఉన్న పోలింగ్ మధ్యాహ్నం 3గంటల తరువాత పుంజుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు వంశీకృష, వాసుపల్లి గణేష్ కుమార్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈసారి కూడా వికాలంగులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు వేసిన ఉత్తర జైభారత్ అభ్యర్థి లక్ష్మీనారాయణ, సతీమణి ఊర్మిళ


వికలాంగురాలితో ఓటు వేయించి తీసుకువస్తున్న పోలీసులు


రాంజీఎస్టేట్ స్కూల్లో సాయంత్రం 6కు బారులు తీరి ఉన్న ఓటర్లు


ఓటర్లను సముదాయిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

జగదాంబ కూడలి: వన్‌టౌన్‌లో వైసీపీ వర్గానికి చెందిన వ్యక్తులు సమస్యలు సృష్టించారు. మునిసిపల్ స్టేడియం పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ మరికొద్దిసేపట్లో ముగుస్తుందన్న సమయంలోభారీగా ఓటర్లు క్యూలైన్‌లో చేరారు. దీంతో రద్దీ నెలకొంది. ఇదే సమయంలో వైసీపీ రౌడీమూకలు, ఆ పార్టీ వార్డు నాయకులు టీడీపీ, జనసేన పార్టీ నాయకులపై కవ్వింపు చర్యలు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్ అక్కడి రావడంతో కూటమి నాయకులపై దాడికి యత్నించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. వాసుపల్లి పరిస్థితిని గమనించి అక్కడ నుండి ఉపక్రమించారు.

టీడీపీ నేతకు పోలీస్‌ల హెచ్చరికలు

మున్సిపల్ స్టేడియం వద్ద నిల్చున్న టీడీపీ వార్డు అధ్యక్షుడు బుచ్చారామిరెడ్డిని డీసీపీ హెచ్చరించారు. బైక్‌కోసం వచ్చానంటూ ఆయన సమాధానం చెబుతున్నా డీసీపీ వినలేదు. వన్‌టౌన్ సీఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశలో వాసుపల్లి వర్గం

మహారాణిపేట, మే 13: మహారాణిపేటలోని 29,30వ వార్డులలో ఓటర్లు కూటమికి అనుకూలంగా ఏకపక్షంగా ఓటు వేసినట్లు తెలుస్తోంది. ఈ రెండు వార్డులలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతుగా అత్యధికమంది ఓటు వేసినట్లు సమాచారం. వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్‌పై ఉన్న వ్యతిరేకత ఓటర్లలో కనిపించింది. అలాగే, నియోజకవర్గంలో గత పదేళ్లకు పైగా శాసనసభ్యుడిగా అనుభవం ఉన్నా ఈసారి పోలింగ్ సమయంలో చేతులు ఎత్తేయడంతో ఆపార్టీ వార్డు అధ్యక్షులు సహా కార్యకర్తలు నిరాశలో కూరుకుపోయారు. పోల్ మెనేజ్‌మెంట్‌లో పూర్తిగా వైఫల్యం చెందారు, వైసీపీ చెందిన వార్డు నాయకులు డబ్బులు కూడా సరిగా పంపిణీ చేయడంతో విఫలం కావడం ప్రజల్లో వాసుపల్లిపై వ్యతిరేకతకు మరింత కారణమైంది. దీంతో ప్రధాన నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద కనిపించలేదు. ఫలితంగా కార్యకర్తలకు టిఫిన్లు, భోజనాలు సంగతి కాదుకదా, తాగేందుకు మంచినీరు సైతం అందించే దిక్కులేకుండా పోయింది. ఈ ప్రతికూల పరిస్థితులన్నీ వాసుపల్లి ఓడిపోబోతున్నారేనేందుకు సంకేతమేనని పలువురు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు.

170 వ బూత్‌లో రాత్రి 9 వరకు పోలింగ్

మహారాణిపేట: 30వ వార్డులో 170వ బూత్‌లో రాత్రి తొమ్మిది గంటల వరకు ఓటింగ్ సాగింది. మధ్య వర్షం కురవటంతో ఓటింగ్‌కు కొంత అంతరాయం కలగడంతో ఓటర్లు పూర్తిస్థాయిలో ఓటుహక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు.


మున్సిపల్ స్టేడియం బూత్ వద్ద ఓటర్లు


సత్యసాయినగర్‌లో బారులు


నక్కవానిపాలెం జీవీఎంసీ పాఠశాల వద్ద క్యూ

ఈవీఎంల మొరాయింపు.. జనాలు అసహనం

- 36, 37 పీఎస్‌లలో రాత్రి పది వరకు ఓటింగ్
- అసహనంతో వెనుదిరిగి ఓటర్లు

మురళీనగర్, మే 13 ; మాధవధార, మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, బర్మాకాలనీ, ఆర్అండ్‌వీ జంక్షన్ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. మాధవధార హైస్కూల్లోని 13 బూత్‌లో ఉదయంనుంచి హడావిడి కనిపించింది. మాధవధార హైస్కూలు సహా ప్రైమరీ, అపూర్వ పాత స్కూల్‌లలోని బూత్‌లకు ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 50 వార్డులోని 246 పీఎస్‌లో ఓటింగ్‌లో జాప్యం చోటుచేసుకోవడంతో బీజేపీ, వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు రిగ్గింగ్ జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. పోలీసు ఉన్నతాధికారుల రాకతో సమస్య కొలిక్కి వచ్చింది. మధ్యాహ్నం కూడా 50వవార్డు పీఎం 238లో వైసీపీ అభ్యర్థి కేకే రాజు గంట సమయానికి పైగా పోలింగ్ స్టేషన్‌లో తిష్ట వేయడంపై టీడీపీ వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ఆయన్ని నిలదీశారు. సీతమ్మధారలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు గంటన్నర పాటు పోలింగ్ కేం ద్రం లో అనధికారికంగా కూర్చుని ఓటర్లని ప్రభావితం చేశారంటూ కేకే రాజు బదులిచ్చారు. ఎన్‌జీజీ ఓ ఎస్ కాలనీలోని 36, 37 పోలింగ్ స్టేషన్ల వద్ద ఈవీ ఎంలు మొరాయించినఉదయం 9 వరకు పోలింగ్ ఆరంభం కాలేదు. మధ్యలోని ఇబ్బంది పెట్టాయి. దీంతో చివరికి రాత్రి 10 వరకు ఈ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. రాత్రి 7 గంటలు దాటాక కూడా పరిస్థితి అదుపులోనికి రాకపోవడంతో కలెక్టరు ఎ.మల్లికార్జున బర్మాకాలనీలోని కేంద్రానికి చేరుకున్నారు. పీవోతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు, టీడీపీ నార్త్ ఎన్నికల పరిశీలకులు నజీర్ తదితరులు కేంద్రంలో సమస్యల్ని పరిష్కారమయ్యేవరకు అక్కడే ఉన్నారు. ఓటర్లు అసెంబ్లీ, ఎం పీ అభ్యర్థులకు ఒకే ఈవీఎంలని భావించి వాటి బటన్‌లు పదే పదే నొక్కడంతో సమస్య తలెత్తినట్లు అధికారులు తెలిపారు. పీఎస్ 36, 37 లో ఓటింగ్ రాత్రి 8 దాటాక కొనసాగింది. ఈ కేంద్రాన్ని కలెక్టర్ పర్యవేక్షిస్తున్న సమయంలో విద్యుత్ అంతరాయం తలెత్తడంతోపాటు వర్షం రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో చాలామంది అసహనంతో కేంద్రం వీడి ఇళ్లకు వెళ్లిపోయారు. కలెక్టర్ ఎదుట పలువురు అసహనం వ్యక్తంచేశారు. ఈ కేంద్రాల్లో 10 గంటల దాటిన వ రకు పోలింగ్ సాగింది.


బర్మాకాలనీ 36 పీఎస్ వద్ద సమీక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు, ఇతరులు


బర్మాకాలనీ కేంద్రంలో రాత్రి 9 గంటలకు బారులు తీరిన ఓటరు

సీబీఎస్ఈ ఫలితాల్లో శ్రీ చైతన్య విజయభేరి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మహారాణిపేట, మే 13: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ అద్భుత ఫలితాలు సాధించారు. విశాఖ కు చెందిన పి.హర్షవర్ధన్ అనే విద్యార్థి 500 మార్కులకు గాను 493 మార్కులను సాధించి చరిత్ర తిరగ రాసినట్లు సంస్థ ఏజీఎం ఎంవీ సురేష్ తెలిపారు. 485 పైగా ఐదుగురు విద్యార్థులు, 480కు పైగా మార్కులతో 13 మంది విద్యార్థులు సం చ లనం సృష్టించారని తెలిపారు.అలాగే, 450 మార్కులు సాధించిన వారు 95 మంది ఉన్నారన్నారు. ఈ రికార్డు సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు అభి నందనలు తెలిపారు.

శ్రీ ప్రకాష్ ప్రభంజనం

సీతమ్మధార, మే 13: సీబీఎస్ఈ పది, పన్నెండో తరగతుల పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల యాజమాన్యం తెలిసింది. పదో తరగతి 484, పన్నెండో తరగతిలో 459 అత్యధిక మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. పదిలో 255 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 62 మంది విద్యార్థులు 90 శాతంపైగా మార్కులు సాధించినట్లు తెలిపారు.

పన్నెండో తరగతిలో 44మంది విద్యార్థులు హాజరుకాగా, ఐదుగురు వి ద్యార్థులు 90శాతం పైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ అభినందించారు.

ఓటు ఉత్సాహం


ఓటరు ఐడీ చూపుతున్న దృశ్యం

... 5వ పేజీ తరువాయి

తరలివచ్చినా పోలింగ్ మాత్రం మందకొడిగా సాగింది. రాత్రి పన్నెండు గంటలకు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం భీమిలిలో 71.14 శాతం, విశాఖ తూర్పులో 68.5 శాతం, విశాఖ దక్షిణలో 62.64, విశాఖ ఉత్తరంలో 61.52, పశ్చిమలో 65.05, గాజువాకలో 64.93 శాతం, పెందుర్తిలో 65.24 శాతం పోలింగ్ నమోదైంది.

ఉదయం నుంచి ఉత్సాహంగానే ఓటర్లు...

సోమవారం ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఉత్సాహంగా బారులు తీరారు. అయితే అనేకచోట్ల ఏడు గంటలకు పోలింగ్ మొదలుకాలేదు. ఈవీఎంలు పనిచేయక గంట నుంచి రెండు గంటలు ఆలస్యమైంది. అయినా ఓటర్లు గంటలకొద్దీ వేచిఉన్నారు. కొన్నిచోట్ల ఫ్యాన్లు పనిచేయకపోవడంతో ఉక్కపోతకు తడిసి ముద్దయ్యారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన 49 వేల మందికి ఓటు హక్కుకల్పించారు. వారంతా ఉత్సాహంగా ఓటువేశారు.

కొన్నిచోట్ల షామియానాల నుంచి ఓటర్లు క్యూ బయటకు రావడంతో ఎండకు ఇబ్బందిపడ్డారు. మరికొన్నిచోట్ల క్యూ ఒకచోట ఉంటే షామియానాలు మరోచోట వేశారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో అధికారులు ఒక విధానం పాటించలేదనే విమర్శలు వచ్చాయి. ఒకచోట 1000 మంది ఓటర్లకు ఒక కేంద్రం ఏర్పాటుచేస్తే, అక్కడక్కడా 500 మంది కంటే తక్కువ ఓటర్లకు ఒక కేంద్రం కేటాయించారు. ఇంకా కేంద్రాల కోసం ఎంపిక చేసుకున్న భవనాలు కొన్నిచోట్ల ఇరుకుగా ఉన్నాయి. దీంతో పురుషులు, మహిళలకు వేర్వేరుగా కాకుండా ఒకే లైను ఏర్పాటుచేశారు. దీంతో ఓటింగా బాగా ఆలస్యమైంది. పెదజాలారిపేటలో మహిళా మోడల్ పోలింగ్ కేంద్రం కోసం ఎంపిక చేసిన సామాజిక భవనం చిన్నది కావడంతో మహిళలు, పురుషులకు వేర్వేరు లైన్లు ఎండలో ఉండిపోవల్సి వచ్చింది. కొంతవరకూ ఏర్పాట్లు బాగానే ఉన్నా పోలింగ్ నిర్వహణలో పీవో నుంచి జిల్లా యంత్రాంగం వరకు విఫలమయ్యారని ఓటర్లు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఓటింగ్ నిర్వహణలో వేగవంతం లేకపోవడంతో సోమవారం రాత్రి 11 గంటల వరకు కొన్నిచోట్ల పోలింగ్ కొనసాగింది.

ఎవరి ధీమా వారిది!!

... 5వ పేజీ తరువాయి

ఘంటాపథంగా చెబుతోంది.

భీమిలిలో గంట మోగనుందా?

భీమిలి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. జిల్లాలో ఆయనకే ఎక్కువ మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తంచేస్తున్నారు. అయితే అదంతా ప్రచారమేనని వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి(అవంతి) శ్రీనివాసరావు గెలుపు ఖాయమని వైసీపీ పెద్దలు అంటున్నారు.

గాజువాకలో పల్లాకు మొగ్గు

గాజువాకలో వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు పరాభవమే మిగులుతుందని, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయం ఖాయమైపోయిందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. మంత్రిగా ఉండి అమర్‌నాథ్ జిల్లా ఏమీ చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి.

పశ్చిమంలో టైట్ ఫైట్

పశ్చిమ నియోజవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ జరిగింది. ఇక్కడ మూడోసారి ఎమ్మెల్యేగా గెలవాలని టీడీపీ అభ్యర్థి గణబాబు సర్వశక్తులు ఒడ్డగా, ఎలాగైనా విజయం సాధించి ఈసారి శాసనసభకు వెళ్లాలని వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గట్టి ప్రయత్నమే చేశారు. ఎక్కడా ఖర్చుకు వెనుకాడలేదు. మల్కాపురం, సింధియా తదితర పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఎవరికి అండగా నిలిస్తే వారే గెలుస్తారనేది టాక్. ఇద్దరిలో ఎవరు గెలిచినా అతి తక్కువ ఓట్ల మెజారిటీయే ఉంటుందని సమాచారం.

ఉత్తరంలో ఓట్లను చీల్చిన జైభారత్

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు గెలుపు కోసం హోరాహోరీ పోరాటం చేశారు. అయితే ఇక్కడ జైభారత్ పార్టీ తరఫున వీవీ లక్ష్మీనారాయణ పోటీలో నిలిచారు. ఆయన చీల్చే ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

విశాఖలో జనసేన జెండా రెపరెపలు

విశాఖ జిల్లాలో ఈసారి జనసేన జెండా ఎగురుతుందని ఆ పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి. దక్షిణ నియోజకవర్గంలో ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్ తొలుత కాసింత ఇబ్బంది ఎదుర్కొన్నా ఆ తరువాత బాగా పుంజుకున్నారు. టీడీపీ సహకారంతో పాటు వైసీపీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే వ్యతిరేకులు కలిసి రావడం అదృష్టంగా మారింది.

పెందుర్తిలో సామాజిక వర్గాల వారీగా చీలిక

పెందుర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ అభ్యర్థి అదీప్ రాజుల మధ్య నువ్వా?, నేనా? అనే పోటీ జరిగినట్టు చెబుతున్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో ఓటర్లు సామాజికవర్గాలకు ప్రాధాన్యమిస్తూ తమ వారికి అనుకూలంగా ఓటింగ్ చేశారు. అధికార పార్టీ అభ్యర్థిపై తీవ్రమైన భూకబ్జాల ఆరోపణలు ఉన్నందున అవే తనకి మైనస్‌గా మారాయని చెబుతున్నారు. పంచకర్లకు టీడీపీ నుంచి బలమైన సాయం ఉండటంతో జనసేనకి జై కొట్టిస్తారని అంటున్నారు.

డా.కూటికుప్పలకు ఎండోమెంట్ పురస్కారం



.కూటికుప్పలను అభినందిస్తున్న అతిథులు

కంచరపాలెం, మే 13: ప్రముఖ వైద్యుడు డా.కూటికుప్పల సూర్యారావుకు ప్రతిష్టాత్మక డా.ఎ.హడింగాల్ ఎండోమెంట్ పురస్కారం లభించింది. ఈ నెల 10వ తేదీ నుంచి బెంగళూరులో జరుగుతున్న 16వ అంతర్జాతీయ సోషల్ ఫిలాసఫీ, 10వ యోగా, ఆధ్యాత్మిక శాస్త్రం తదితర అంశాలపై సదస్సులో భాగంగా డా.సూర్యారావుకు ఈ పురస్కరాన్ని అతిథులు అందజేశారు. ఆచార్య యఘ్నేశ్వర్ శాస్త్రి అధ్యక్షతన జరిగిన సదస్సులో డా.కూటికుప్పల తన ఉపన్యాసాన్ని అందించారు. సదస్సులో శారీరక, మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను వివరించారు. ఈ సదస్సులో హిజ్ హోలీనల్ శ్రీ శాంతా భీష్మ చౌడయ్య స్వామిజీ, డా.అరుధాభారతి స్వామిజీ, ప్రొ.వై.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎండలో బారులు..

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గ పరిధిలో అనేక పోలింగ్ కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లులేక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధురవాడ, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో బూత్‌ల ఎదుట టెంట్లు ఉన్నా అవి చాలక ఎండలో నిరీక్షించాల్సి వచ్చింది. దాహం వేసినా నీళ్ల ఇచ్చే వాళ్ల లేకపోవడంతో అలసిపోయారు. కొంతమంది వెనక్కి ఇంటికి వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చారు. తొలిసారి ఓటు హక్కు వేసిన యువత ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఆ ఫొటోలను వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ 'నేను ఓటేశాను.. మీరూ వేయండి' అన్న హ్యాష్ ట్యాగ్‌లతో పోస్టులు చేశారు.


ఓటర్లతో రద్దీగా ఉన్న గాజువాకలోని ఓ పోలింగ్ కేంద్రం


కూర్మన్నపాలెం సమీపంలోని భరత్‌నగర్ పోలింగ్ బూత్ వద్ద క్యూలో వేచివున్న ప్రజలు


గోపాలపట్నంలో రద్దీగా ఉన్న పోలింగ్ కేంద్రం

సజావుగా పోలింగ్


ఎన్నికలు ముగియడంతో
పెందుర్తిలో ఈవీఎంకు సీల్ వేస్తున్న అధికారులు

గాజువాక, మే 13: సార్వత్రిక ఎన్నికలు సోమవారం గాజువాక నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయి. సుమారు 66 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభమవ్వగా, అప్పటికే పెద్దసంఖ్యలో ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలో నిల్చున్నారు. అయితే పలుచోట్ల ఈవీఎంలు మోరాయించడంతో గంట నుంచి రెండు గంటల పాటు పోలింగ్ ఆలస్యమైంది. దీంతో ఆయా కేంద్రాల్లోని ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులు ఇక్కట్లపాలయ్యారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల తాకిడి అధికంగానే కనిపించింది. ఎండ తీవ్రత అధికం కావడంతో 12 నుంచి మూడు గంటల వరకు ఓటర్లు పెద్దగా పోలింగ్ కేంద్రాలకు రాలేదు. మళ్లీ మూడు తర్వాత నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటర్ల తాకిడి అధికమైంది. ఆరు గంటల వరకు మాత్రమే ఓట్లు వేసేందుకు అధికారులు అనుమతించారు. ఆరు దాటాక ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన ఓటర్లను పోలీసులు అనుమతించలేదు. ఆరు గంటల సమయంలో క్యూలో ఉన్న వారంతా ఓట్లు వేసేలా చూశారు. కాగా పలుచోట్ల ఈవీఎంలు మొరాయించినట్టు ఆయా కేంద్రాల సిబ్బంది ఆర్‌వోకు తెలియజేయడంతో టెక్నికల్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకుని లోపాలను సరిదిద్దారు. గాజువాక నియోజకవర్గ పరిధిలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

వంద మీటర్ల దూరంలో పార్టీల టెంట్లు

పోలింగ్ కేంద్రాలకు దాదాపు వంద మీటర్ల దూరంలో ఆయా పార్టీలకు చెందిన వారు టెంట్లు వేసుకున్నారు. ఒక్కో కేంద్రం వద్ద సుమారు టెంట్లు కనిపించాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు సైతం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక మొబైల్ పార్టీలను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించారు.

స్టీల్‌ప్లాంట్‌లో 54.35 శాతం పోలింగ్

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో 54.35 శాతం పోలింగ్ నమోదైంది. టౌన్‌షిప్‌లో 7,755 మంది ఓటర్లకు గాను 4,215 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ మూడు కేంద్రాల్లో తొమ్మిది బూత్‌లను ఏర్పాటు చేశారు. డీఏవీ స్కూల్‌లో ఈవీఎంలు మోరాయించడంతో ఉదయం 7.45 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఆయా కేంద్రాల వద్ద రాజకీయ పార్టీలు టెంట్లు వేసేందుకు యత్నించినప్పటికీ పోలీసులు అనుమతించలేదు. ఈ కేంద్రాల్లో ఎక్కువ మంది ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పెదగంట్యాడ మండలంలో

పెదగంట్యాడ: పెదగంట్యాడ మండలంలో స్వల్ప సంఘటనలు మినహా 86 కేంద్రాల్లోనూ పోలింగ్ సజావుగా సాగింది. ప్రభుత్వ ఐటీఐలోని 259వ నంబర్ బూత్‌లో ఈవీఎం మిషన్ సాంకేతిక కారణాలలో పనిచేయకపోవడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. నడుపూరులోని 238వ నంబర్ బూత్‌లో ఉదయం పది నుంచి రెండు గంటల పాటు ఈవీఎం మొరాయించింది. కాగా పోలింగ్ కేంద్రాల బారులుతీరారు. 12.30 గంటల వరకు పోలింగ్ కేంద్రాలన్నీ రద్దీగానే కనిపించాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమైన గంగవరం పోలింగ్ స్టేషన్ వద్ద కేంద్ర బలగాలను మోహరింపజేశారు.

మొరాయించిన ఈవీఎంలతో ఓటర్లకు తిప్పలు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా ఫార్మాసిటీ పునరావాస కాలనీ, పెదమడక, పాత అగనంపూడి, దొంకాడ, పినమడక, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఓటర్లు గంటలకొద్దీ క్యూ లైన్లలో వేచివుండాల్సి వచ్చింది. టెంట్లు ఏర్పాటు చేసినప్పటికీ క్యూ లైన్లు బయటకు వచ్చేయ డంతో చాలామంది ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం వరకు కేవలం 30 శాతం మాత్రమే పోలింగ్ జరిగినా, ఆ తర్వాత ఒక్కసారిగా జోరందుకున్నది. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో సాయంత్రం నాలుగు గంటల తర్వాత చాలామంది తమ ఓటు హక్కు వినియోగించుకు నేందుకు ఆయా కేంద్రాలకు తరలిరావడంతో రద్దీ నెలకొంది. ఇక్కడ 25 బూత్‌లగాను పది పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

86వ వార్డు పరిధిలో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం భరత్‌నగర్ పోలింగ్ బూత్ నంబర్ 73లో ఈవీఎం గంటన్నరపాటు మొరాయించడంతో సాయంత్రం ఆరు గంట లైనా ఓటర్లు అధిక సంఖ్యలో క్యూలో ఉండడంతో ఇక్కడ రాత్రి 10 గంటలు దాటినా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. అలాగే 86వ వార్డు పకీరుతఖ్యాలోని 132వ నంబర్ పోలింగ్ బూత్ వద్ద సుమారు సుమారు గంటన్నరపాటు ఈవీఎంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. 88వ వార్డు గ్రీన్‌సిటీ నర్సింగవానిపాలెం 135వ నంబర్ పోలింగ్ బూత్ వద్ద యూరిన్ బ్యాగ్‌తో సహా వృద్ధురాలిని ఓటు వేసేందుకు ఆటోలో తీసుకువచ్చారు. 70వ వార్డు చట్టివానిపాలెం సచివాలయం వద్ద 112వ పోలింగ్ బూత్, 87వ వార్డు కణితి హైస్కూల్‌లో పోలింగ్ బూత్ నంబర్ 67 వద్ద నడవలేని స్థితిలో ఉన్నవారికి వీల్‌చైర్లలో తీసుకువచ్చారు. 71వ వార్డు తోకాడ 120వ నంబర్ పోలింగ్ బూత్‌కు ఏజెంట్లు 45 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. 70వ వార్డు డ్రైవర్స్ కాలనీ బూత్, 113వ పోలింగ్ బూత్ గంటపాలు ఈవీఎంలు మొరాయించాయి. 71వ వార్డులోని టీఎస్సార్ టీబీకే కళాశాలలో, యాపిల్ స్కూల్‌లో, దిబ్బపాలెంలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు అధిక సంఖ్యలో ఓటర్లు తరలివచ్చారు. 86వ వార్డులోని కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, 88వ వార్డు పరిధి దువ్వాడ, కాపు జగ్గరాజుపేట, గ్రీన్‌సిటీలలోని బూత్‌లను టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐలు ఎర్రంనాయుడు, నాగరాజు తగిన చర్యలు చేపట్టారు.

మండుటెండలో బారులుతీరిన ఓటర్లు...

సింధియా: జీవీఎంసీ 40, 62, 63 వార్డుల పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం ఏడు గంటల నుంచే ఓటర్లు క్యూ కట్టారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు మహిళలు బారులు తీరారు. పది గంటల సమయానికి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఓటర్ల తాకిడి మరింత అధికమైంది. వృద్ధులు, దివ్యాంగులను వీల్‌చైర్ సహాయంతో పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడంతో వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

పెందుర్తిలో సుమారు 66 శాతం పోలింగ్

పెందుర్తి: ఓటు హక్కు వినియోగించుకునేందుకు పెందుర్తి నియోజకవర్గంలో జనం పోటెత్తారు. మండుటెండలో సైతం గంటల తరబడి నిల్చొని ఓట్లు వేశారు. స్వల్ప వివాదాలు తప్ప ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. అధికారుల సమాచారం మేరకు సుమారు 66 శాతం పోలింగ్ నమోదైంది. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ ప్రక్రియకు కొంతసేపు అంతరాయం వాటిల్లింది. ఉదయం సుమారు రెండు గంటల పాటు పోలింగ్ మందకొడిగా సాగినా ఆ తర్వాత ఊపందు కున్నది. అనేక పోలింగ్ కేంద్రాల వద్ద వేసిన టెంట్లు సరిపడా లేకపోవడంతో పలువురు ఓటర్లు ఎండదెబ్బకు విలవిల్లాడారు. సరిపల్లి, పెందుర్తి, చినముషిడివాడ, జెర్రిపోతులపాలెం, రాంపురంలో సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత కూడా క్యూలో వేచివుండడంతో రాత్రి వరకు ఓటింగ్ కొనసాగింది. కాగా ఈసారి మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఓట్లు వేసేందుకు రావడం గమనార్హం. పలువురు మహిళలు చంటిపిల్లలను ఎత్తుకుని మరీ ఓట్లేశారు. రాంపురం, సరిపల్లి, ఎస్.ఆర్.పురం, పెదగాడి, పినగాడి, రాంపురం, పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, పురుషోత్తపురం, చీమలాపల్లిల్లో పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో ఓట్లు వేశారు. కాగా వైసీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చినముషిడివాడలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సరిపల్లి, పాత పెందుర్తి, పెందుర్తి, చినముషిడివాడ పోలింగ్ బూత్‌లను సందర్శించారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, పంచకర్ల పెందుర్తిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

ఈవీఎంల మొరాయింపు
మినహా ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు


ఓట్లు వేసిన ఆనంద్‌కుమార్, గణబాబు, పల్లా శ్రీనివాసరావు


సరిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద పంచకర్ల రమేశ్‌బాబు


చినముషిడివాడ కేంద్రం వద్ద అన్నంరెడ్డి అదీప్‌రాజ్


గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న సీపీ రవిశంకర్ అయ్యనార్


పెందుర్తి మండలం సరిపల్లిలో బారులుతీరిన ఓటర్లు


పారిశ్రామిక ప్రాంతంలో మండుటెండలో ఓటర్ల పాట్లు


ప్రహ్లాదపురం మెయిన్ రోడ్డులో సాయంత్రం 6 తర్వాత..


నడుపూరు వెటర్నరీ ఆస్పత్రి వద్ద రాత్రి 9గంటలకు..

95వ వార్డులో..

పెందుర్తి-రూరల్: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం ఆరున్నర నుంచి ఓటర్లు క్యూ కట్టారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరు గంటల వరకు క్యూ ఉన్నవారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టడంతో పలు బూత్‌ల వద్ద రాత్రి ఏడు వరకు పోలింగ్ నిర్వహించారు.

89, 91, 92 వార్డుల్లో..

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గ పరిధి గోపాలపట్నం కేంద్రంగా 89, 91, 92 వార్డుల్లో గల లక్ష్మీనగర్, గోపాలపట్నం, కొత్తపాలెం, యల్లపువానిపాలెం, వెంకటాపురం, పద్మనాభనగర్ ప్రాంతాల్లో గల ఎనిమిది పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని చాలామంది ఉదయం ఆరున్నరకే ఆయా కేంద్రాల వద్ద క్యూ కట్టారు. తొమ్మిది గంటలయ్యేసరి ఆయా కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరారు. వైసీపీ 'పశ్చిమ' అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ మర్రిపాలెం రైల్వే పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి గణబాబు గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్‌లో ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తుతో పాటు ప్రత్యేక బృందాలు ఉండడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ప్రతిసారి ఎన్నికల్లో గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో రాయకీయ పార్టీల అనుచర గణం ఉద్దేశపూర్వకంగా గొడవలను సృష్టించి రిగ్గింగ్‌కు పాల్పడతారనే ఆరోపణలు ఉండడంతో సాయంత్రం ఐదు గంటలప్పుడు సీపీ రవిశంకర్ ఇక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఈ కేంద్రం వద్ద నిఘా పెట్టడంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ సమయం ఆరు గంటలు ముగిసే సరికి చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు క్యూలో ఉండడంతో రాత్రి ఎనిమిది గంటల వరకు పోలింగ్ కొనసాగింది. అయితే రాత్రి ఏడు గంటలకు గోపాలపట్నం పరిసరాల్లో ఈదురు గాలులతో వర్షం కురవడంతో సుమారు అరగంటసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే పోలింగ్ కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయడంతో సజావుగా పోలింగ్ జరిగింది.

పారిశ్రామిక ప్రాంతంలో బారులుతీరిన ఓటర్లు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని 40, 58 నుంచి 63 వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం ఏడు గంటలకే ఓటర్లు బారులుతీరారు. ఓటర్ల తాకిడి అధికంగా ఉండడంతో రోడ్ల మీదకు క్యూ లైన్లు చేరాయి. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు వేయకపోవడంతో పలువురు ఓటర్లు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లడంతో సిబ్బంది, ఓటర్లు ఉక్కపోతకు గురయ్యారు. దివ్యాంగులతో పాటు నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులను వీల్‌చైర్ల ద్వారా ఆయా కేంద్రాలకు తీసుకువచ్చారు. 58వ వార్డులో సుమారు 85 శాతం, 59వ వార్డులో 60, 60వ వార్డులో 62, 61వ వార్డులో 80 శాతం ఓటింగ్ నమోదైంది.

56, 57 వార్డుల్లో..

ఆర్పీపేట (కంచరపాలెం): గ్రేటర్ 56వ వార్డుకు సంబంధించి ఆర్పీపేట ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, కంచరపాలెం ప్రాథమిక పాఠశాల, ఈపీడీసీఎల్ కంచరపాలెం ఏఈ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింద. అలాగే 57వ వార్డు పరిధి సుభాష్‌నగర్ పాఠశాల, ఆశవానిపాలెం, కప్పరాడ, జ్యోతినగర్ పాఠశాలల్లోని బూత్‌ల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలుత మందకొడిగా సాగిన పోలింగ్ ఉదయం పది గంటలు దాటాక ఊపందుకున్నది. వైసీపీ పశ్చిమ అభ్యర్థి ఆడారి ఆనందకుమార్ ఆర్పీపేట పాఠశాలలోని కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.


మల్కాపురంలో దివ్యాంగుడిని
పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు

90, 52 వార్డుల్లో..

ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట: పశ్చిమ నియోజకవర్గ పరిధి 90, 52 వార్డుల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. బుచ్చిరాజుపాలెంలోని యూనిట్-1లోని స్మార్ట్ పోలింగ్ కేంద్రం 59వ నంబర్ పోలింగ్ బూత్‌లో అధిక సంఖ్యలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. బ్లాక్-2లో ఉన్న 67వ పోలింగ్ బూత్ వద్ద తొమ్మిది గంటల సమయంలో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. బుచ్చిరాజుపాలెంలోని ఎన్నికల సరళిని టీడీపీ పశ్చిమ అభ్యర్థి గణబాబు పరిశీలించారు. కాగా పాత కరాస ప్రైమరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ ప్రాంగణం చిన్నదిగా ఉండడం.. ఇక్కడ నాలుగు బూత్‌లను ఏర్పాటు చేయడంతో ఓటర్లు క్యూ లైన్లో నిల్చొనేందుకు ఇబ్బందులకు గురయ్యారు. మర్రిపాలెంలో రైల్వే స్కూల్‌లో పింక్ బూత్ నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద అధిక సంఖ్యలో ఓటర్లు సెల్ఫీలు దిగారు.

'పెందుర్తి' పరిధి ఆర్.ఆర్.వి.పురం ఆళ్వార్ కళాశాల ప్రాంగణం, నాయుడుతోట, ప్రహ్లాదపురం పల్లినారాయణపురం అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూల్, గొల్లనారాయణపురం ప్రైమరీ స్కూల్, అప్పన్నపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం స్కూల్, వేపగుంట హైస్కూల్, ప్రైమరీ స్కూళ్లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆర్.ఆర్.వి.పురం ఆళ్వార్ కళాశాల ప్రాంగణంలో పోలింగ్ సరళిని పంచకర్ల రమేశ్‌బాబు పరిశీలించారు. 201, 204 నంబర్ల పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మోరాయించడంతో పోలింగ్‌లో ఆలస్యం చోటుచేసుకుంది. ప్రహ్లాదపుర పోలింగ్ బూత్ నంబర్ 281లో సాయంత్రం ఆరు దాటాక కూడా క్యూలో ఓటర్లు ఉండడంతో ఇక్కడ రాత్రి ఏడున్నర వరకు పోలింగ్ కొనసాగింది. ఆర్.ఆర్.వి.పురం ఆళ్వార్స్ ప్రాంగణంలోని 201వ నంబర్ పోలింగ్ బూత్‌లో రాత్రి ఎనిమిది వరకు పోలింగ్ జరిగింది. కాగా వేపగుంట హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలించి పంచకర్ల రమేశ్‌బాబు వెళుతున్న తరుణంలో పలువురు వైసీపీ నాయకులు గట్టిగా కేకలు వేయడంతో ఇరు వర్గాలకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.


పెదగంట్యాడ మండలం వెంకన్నపాలెంలోని
పోలింగ్ బూత్ వద్ద బారులుతీరిన ఓటర్లు

కొత్త గాజువాక ఎంపీపీ స్కూల్‌లో ఉద్రిక్తత

రెండు గంటల పాటు పనిచేయని ఈవీఎంలు
ఆందోళనకు దిగిన ఓటర్లు

గాజువాక, మే 13: కొత్త గాజువాక ఎంపీపీ స్కూల్‌లోని 197, 198, 199 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సుమారు 3,500 మంది ఓట్లు వేయాల్సి ఉంది. అయితే ఇక్కడ గదులు చిన్నగా ఇరుకుగా ఉండడంతో పాటు వరండా కూడా లేకపోవటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం ఎనిమిది గంటలకే ఈ కేంద్రాలకు అధిక సంఖ్యలో ఓటర్లు చేరుకున్నారు. ఇక్కడ కనీసం ఫ్యాన్‌లు లేకపోవడం, ఈవీఎంలు మొరాయించటంతో పోలింగ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. మళ్లీ అరగంటలోనే ఈవీఎంలు పనిచేయక పోవడంతో ఒక్కసారిగా ఓటర్లు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ఇక్కడకు చేరుకుని పరిస్థితిని రిటర్నింగ్ అధికారికి వివరించారు. దీంతో ఆర్‌వో లక్ష్మారెడ్డి, సాంకేతిక నిపుణులు వచ్చి ఈవీఎంలను వినియోగంలోకి తెచ్చారు. కాగా ఉక్కపోతను భరించలేక కొంతమంది ఓట్లు వేయకుండానే ఇంటి ముఖం పట్టారు. ఇక్కడ పోలింగ్ స్టేషన్ నిర్వహించడం సరికాదని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

గంగవరంలో 70 కుటుంబాలు ఓటింగ్‌కు దూరం

గత నెల రోజులుగా న్యాయ సమ్మతమైన తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. 70 మంది కార్మికులు ఆందోళన చేస్తూ పోర్టు లోపలే ఉండిపోయారు. దీంతో వారి కుటుంబాలు ఓట్లు వేసేందుకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు.

వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వివాదం

పెందుర్తి, మే 13: చినముషిడివాడ శాంతినగర్‌లోని పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వివాదం నెలకొంది. కార్పొరేటర్ సేనాపతి వసంత భర్త శంకరరావు పోలింగ్ కేంద్రానికి వచ్చి అక్కడి పీఏస్‌లో ఉన్న వైసీపీ వార్డు అధ్యక్షుడు మెంటి మహేశ్‌ను ఉద్దేశించి ఇక్కడ అయన ఎందుకున్నారని అనడంతో వైసీపీ వర్గీయులు కార్పొరేటర్ భర్త ఎందుకు వచ్చారని అనడంతో ఇరువర్గాల మధ్య కాస్త తోపులాట జరిగి వివాదం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది ఇరు వర్గాలకు సర్దిచెప్పడంతో వారు శాంతించారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం).
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 23, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 26, క్యారెట్ 36, దొండకాయలు 27, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 150, బరబాటి 46, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 98, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్(పెన్సిల్) 80, పొటల్స్ 44, కీరదోస 30, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 66, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)


(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554


చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	130
ఫారం ధర	--	150
విత్ స్కిన్	--	270
స్కిన్‌లెస్	--	280


మల్కాపురం పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఓటర్లు


పెదమడక పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో వేచివున్న ప్రజలు


71వ వార్డు టీఎస్సార్ టీబీకే కళాశాల వద్ద ఓటర్లు..

భారీ వర్షం: విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెందుర్తి, మే 13: పెందుర్తిలో సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో భారీ వర్షం కురవడంతో పోలింగ్ అంతరాయం వాటిల్లింది. వర్షానికి తోడు ఈదురుగాలులు బలంగా వీయడంతో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. సుమారు రెండున్నర గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సరిపల్లి, రాజయ్యపేట, రాంపురం, ముదపాక, జుత్తాడలో ఆరు గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించారు. కాగా సరిపల్లిలో కేంద్రంల్లో పోలింగ్ సమయం ముగిశాక క్యూలో సుమారు మూడు వందల మంది ఓటర్లు ఉండడంతో వారంతా ఓటు హక్కు వినియోగించుకునేసరికి రాత్రి పది గంటలైంది. భారీ వర్షానికి తోడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో రెండున్నర గంటలపాటు ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. పోలింగ్ సిబ్బంది టార్చిలైట్లు, సెల్ ఫోన్ల వెలుగులో ఈవీఎంల బ్యాకప్‌తో ఓటింగ్‌కు అంతరాయం వాటిల్లకుండా పోలింగ్ ప్రక్రియను కొనసాగించారు. ఈ క్రమంలో సిబ్బంది తీరు పట్ల పలువురు ఓటర్లు అసహనానికి గురై వివాదానికి దిగడంతో సీఐ రామకృష్ణ సర్దిచెప్పారు. విద్యుత్ శాఖ ఏఈ బి.రవి ఆధ్వర్యంలో సరిపల్లి లైన్‌మన్ ఇక్కడకు చేరుకుని జనరేటర్ సహాయంతో అప్పటికప్పుడు లైట్లు ఏర్పాటు చేయడంతో పోలింగ్ సజావుగా సాగింది. అలాగే రెండున్నర గంటలపాటు విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమించి విరిగిపడ్డ చెట్లను తొలగించి రాత్రి పదిన్నరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


సరిపల్లి పోలింగ్ కేంద్రంలో చీకట్లో ఓటర్లు

'పశ్చిమ'లో ఎన్నాళ్లకెన్నాళ్లకు..

గోపాలపట్నం, మే 13: పశ్చిమ నియోజకవర్గ ఏర్పడ్డాక ఇప్పటివరకు నాలుగుసార్లు ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు జరిగిన మూడు ఎన్నికల్లో కూడా గణబాబు తప్ప ఏ ప్రధాన పార్టీ అభ్యర్థి కూడా 'పశ్చిమ'లో ఓటు హక్కును వినియోగించుకోలేదు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మళ్ల విజయప్రసాద్ తూర్పు నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ నుంచి పోటీ చేసిన గుడివాడ నాగమణి 'గాజువాక'లో ఓటు వేశారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన దాడి రత్నాకర్ కూడా 'అనకాపల్లి'లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. 20019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మళ్ల విజయప్రసాద్ 'తూర్పు'లో ఓటు వేశారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో మాత్రం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆడారి ఆనంద్‌కుమార్ పశ్చిమ నియోజకవర్గంలోనే ఓటు హక్కును వినియోగింకోవడం గమనార్హం. దీంతో పదిహేనేళ్ల తర్వాత ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు 'పశ్చిమ'లో ఓటు హక్కును వినియోగించుకున్నట్లైంది.



మాధవధార స్కూల్లో పోటెత్తిన ఓటర్లు





ఓటు వేసిన ఉత్తరం బీజేపీ, వైసీపీ అభ్యర్థులు విష్ణుకుమార్‌రాజు, కేకే రాజు



పోలింగ్ కేంద్రం సందర్శించిన దక్షిణం వైసీపీ అభ్యర్థి వాసుపల్లి



వృద్ధురాలితో మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి వంశీకృష్ణ

'ఓటె'త్తిన ఉత్సాహం

- ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో బారులుతీరిన ఓటర్లు
- ఉదయం 10 తర్వాత పుంజుకున్న పోలింగ్
- ఎండలో సైతం నిరీక్షించి మరీ ఓటేసిన జనం

సీతమ్మధార, మే 13: ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఓటర్లు పోటెత్తారు. పలుచోట్ల ఓటర్లు గంటల తరబడి క్యూలో నిల్చొని మరీ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. నక్కవానిపాలెం, మద్దిలపాలెం జీవీఎంసీ పాఠశాల, ఎన్ఎంసిహెచ్ జీవీఎంసీ పాఠశాల, శారదా విద్యానిలయం, సీతమ్మధార ఆర్అండ్‌బీ వద్ద కేంద్రం, వీబీవీ పాఠశాల, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, సీతంపేట రాజేంద్రనగర్ జీవీఎంసీ పాఠశాల, మధురానగర్ జీవీఎంసీ పాఠశాల, వీటీ కాలేజీ,బీవీకే కళాశాలల్లో పోలింగ్ బూతుల వద్దకు ఉదయంనుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటర్లు ఉత్సాహంగా వచ్చారు. తర్వాత తాకిడి తగ్గింది. ఎన్ఎంసీహెచ్ స్కూల్, మధురానగర్ జీవీఎంసీ పాఠశాల, బీవీకే కళాశాలలో సాయంత్రం ఆరు గంటలు దాటిన జనం పెద్ద ఎత్తున బారుతీరాయి.

వీబీవీ హైస్కూల్‌లో మోరాయించిన ఈవీఎంలు

ఆయా సెంటర్‌లో ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. గురుద్వార వద్ద గల వీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల్లో రెండు ఈవీఎంలు మొరాయించడంతో గంట వరకు ఓటింగ్‌ఆలస్యమైంది. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు, జైభారత్ పార్టీ అభ్యర్థి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అక్కయపాలెంలో స్వల్ప ఘర్షణలు

అక్కయ్యపాలెం, మే 13: ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ కాస్త ఆలస్యమైంది. హైదరాబాద్, చెన్నై, విజయవాడ ప్రాంతాల నుంచి ఓటర్లు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా దివ్యాంగులు, వయో వృద్ధులకు వీల్‌చైర్లలో వచ్చి ఓట్లు వేశారు. గేటర్ 44వ వార్డు కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్ బూత్ బయట వైసీపీ కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు, టీడీపీ, బీజేపీ నాయకులు వేర్వేరుగా ఆయా పార్టీల గుర్తులకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న సమయంలో ఇరు పార్టీల నాయకులకు వాగ్వాదం జరిగింది. పోలీసులు వచ్చి సర్దుబాటు చేశారు. టీడీపీ కార్యకర్త జాగారపు శ్రీనివాస్‌ను పోలీసులు వాహనంలో ఎక్కించి తర్వాత వదిలేశారు. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ బూత్ ఎదుట, శంకువానిపాలెంలోని పోలింగ్ బూత్‌ల వద్ద వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు కలుగ జేసుకోవాల్సి వచ్చింది. జ్ఞానకేతన్ పాఠశాల, కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల్లో గేటు మూసివేసి సాయంత్రం 6 గంటల వరకు లోపల ఉన్న వారిని మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించారు. బీజేపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పి.విష్ణుకుమార్ రాజు, కేకేరాజు ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్‌జీజీఓస్ కాలనీ పాఠశాలలోని బూత్‌లో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ తన ఓటును వేశారు. పోలింగ్ బూతుల ఎదుట సచివాలయం ఉద్యోగులు ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేసి ఓటర్ల ఓటర్ కార్డులను స్కాన్ చేసి వారి ఓటు ఎక్కడ ఉందో చెప్పారు. భీమిలీ నియోజకవర్గం గ్రేటర్ 45వ వార్డు సత్యసాయినగర్‌లో ఏర్పాటు చేసిన 231 నంబర్ బూత్‌లో 1497 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం ఆరు తర్వాత కూడా పోలింగ్ సాగింది.

47, 48, 54, 55 వార్డుల్లో...

కంచరపాలెం, మే 13: ఉత్తర నియోజక వర్గం పరిధి 47, 48, 54, 55 వార్డుల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఉదయం ఏడు నుంచి 9గంటల వరకు కొంచెం మందకొడిగా పోలింగ్ జరిగినా తరువాత పుంజుకుంది. ఎండను సైతం లెక్క చేయకుండా మహిళలు క్యూలో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధర్మానగర్, రాంజీ ఎస్టేట్ స్కూల్, స్టీల్‌సిటీ స్కూల్,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బర్మాక్యాంప్‌లో ఉన్న కె.కాలనీ స్కూల్లో పోలింగ్ కేంద్రాలకు ప్రజలు బారులుతీరారు. చిన్న పిల్లల తల్లులు,వృద్ధుల కోసం అసౌకర్యంలేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ 47,48వ వార్డుల సరిహద్దులో ఉన్న రాంజీఎస్టేట్ ప్రాథమిక పాఠశాల్లో సాయంత్రం 6గంటలకు సుమారు 300 మంది క్యూలో నిల్చొని ఉండడంతో కాస్త గందరగోళ పరిస్థితి నెలకొంది. కలెక్టరు డా.ఎ.మల్లికార్జున వచ్చి ఈ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. క్యూలోని వారందరికీ కూపన్లు పంపిణీ చేసి పోలింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో రాత్రి దాదాపు 8గంటల వరకు పోలింగ్ ముగిసింది. వార్డుల్లో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

సిరిపురం: ఆంధ్రయూనివర్సిటీ ఇంజనీరింగ్ క్యాంపస్ 221వ బూత్‌లో జైభారత్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ తన సతీమణి ఊర్మిళతో కలిసి మధ్యాహ్నం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ఈవీఎం సక్రమంగా పనిచేయకపోవడంతో తెరిగి వెళ్లిన వారు మధ్యాహ్నం వచ్చి ఓటు వేశారు. అత్యధిక మంది తమ ఓటుహక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగం కావాలన్నారు.

31వ వార్డులో ప్రశాంతంగా పోలింగ్

ఈవీఎంలు మోరాయింపులపై ఆగ్రహం



ఎన్ఎంసీహెచ్ జీవీఎంసీ స్కూల్ ఎదుట నిరీక్షిస్తున్న ఓటర్లు

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గం జై భారత్ పార్టీ అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణ ఈవీఎంలు మోరాయించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీడీ కాలనీ వీబీవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈవీఎంలు సరిగా పనిచేయక ఓటర్లు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటింగ్ తీరును పరిశీలించడానికి వచ్చిన లక్ష్మీనారాయణ వారు దృష్టికి తీసుకురావడంతో పోలింగ్ బూత్‌ల్లో అధికారులను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఉదయంనుంచి వృద్ధులు , మహిళలు క్యూ నిల్చొని ఉండడంతో ఎండకు ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తంచేశారు.

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి 31వ వార్డు పరిధిలోని ప్రేమ సమాజం ప్రాథమిక స్కూల్, జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాల, డ్వాక్రా బజార్, ప్రభుత్వ వుమెన్ కాలేజీ ప్రాంతంలోని పలు బూత్‌ల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ప్రేమ సమాజం స్కూల్‌లో ఓటర్లు ఎండలో నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో పలువురు ప్రజలు వెనుతిరుగుతుండటంతో వెంటనే సంబంధిత అధికారులు స్పందించి టెంట్‌లో నీడ ఉన్న చోటికి క్యూలైన్‌లను మార్పుచేశారు. సాయంత్రం వేళలో పోలింగ్ కేంద్రాలకు అధిక సంఖ్యలో రావడం కనిపించింది. వృద్ధులకు ఇతరులకు సైతం క్యూలైన్‌లో ఉన్నవారికి సైతం నీటిని సరఫరా చేశారు. వృద్ధులను వీల్‌చైర్‌లో తీసుకొచ్చి ఓటు హక్కు త్వరితగతిన వేసేలా ఏర్పాట్లు చేశారు.

ప్రేమ సమాజం పోలింగ్ బూత్‌ను సందర్శించిన వంశీకృష్ణ

ప్రేమ సమాజం పోలింగ్ బూత్‌ను జనసేన దక్షిణం అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్‌సాయంత్రం సందర్శించారు. ఓటర్లకు ఏమైనా ఇబ్బందులున్నాయా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. వీల్‌చైర్‌లోని ఓటేసేందుకు వచ్చిన వృద్ధురాలిని పలకరించి అక్కడ నుంచి వెనుతిరిగారు.ఉదయం వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సందర్శించి ఓటర్లకునమస్కరించారు. ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సైతం వచ్చి సందర్శించి వెళ్లారు.

31వ వార్డు పరిధిలో ..

జీవీఎంసీ 31వ వార్డు పరిధిలోని పోలింగ్ 70,71, 72, 88, 91, 92, 199, 200 నుంచి 216 బూత్‌లు డాబాగార్డెన్స్, గొల్లలపాలెం, చాకలిపేట, బ్యాంక్ కాలనీ, లలితాకాలనీల్లో ఓటర్లు భిన్నంగా వేసినట్టు సమాచారం. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు వరకు కూటమి అభ్యర్థి గాజుగ్లాస్‌కు ఎక్కువగా ఓట్లు పోలయినట్టు సమాచారం. తరువాత వైసీపీకి కొంత మేరకు అనుకూలంగా కనిపించింది. యువత, మహిళలు, వృద్ధుల్లో పలువురు కూటమివైపు మొగ్గుచూపినట్టు సమాచారం. 31వ వార్డులోని ప్రత్యేకంగా తొలి నుంచి టీడీపీమంచి ఓటింగ్ బ్యాంక్ ఉంది. దీని ఆధారంగా గాజుగ్లాస్‌కు ఓట్లువేసినట్టు తెలుస్తోంది.

జ్ఞానాపురం: దక్షిణ నియోజకవర్గం పరిధిలోని 41, 32, 33, 34వ వార్డు పరిధిల్లోని జ్ఞానాపురం, అల్లిపురం, నీమ్మవేపచెట్టు, వెంకటేశ్వరమెట్ట, కొబ్బరితోట, నేరెళ్ల కోనేరు ప్రాంతాల్లో స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం 11గంటల వరకు మందకొడిగా ఉన్న పోలింగ్ మధ్యాహ్నం 3గంటల తరువాత పుంజుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు వంశీకృష, వాసుపల్లి గణేష్ కుమార్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈసారి కూడా వికాలంగులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో



ఓటు వేసిన ఉత్తర జైభారత్ అభ్యర్థి లక్ష్మీనారాయణ, సతీమణి ఊర్మిళ



వికలాంగురాలితో ఓటు వేయించి తీసుకువస్తున్న పోలీసులు



రాంజీఎస్టేట్ స్కూల్లో సాయంత్రం 6కు బారులు తీరి ఉన్న ఓటర్లు



ఓటర్లను సముదాయిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జగదాంబ కూడలి: వన్‌టౌన్‌లో వైసీపీ వర్గానికి చెందిన వ్యక్తులు సమస్యలు సృష్టించారు. మునిసిపల్ స్టేడియం పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ మరికొద్దిసేపట్లో ముగుస్తుందన్న సమయంలోభారీగా ఓటర్లు క్యూలైన్‌లో చేరారు. దీంతో రద్దీ నెలకొంది. ఇదే సమయంలో వైసీపీ రౌడీమూకలు, ఆ పార్టీ వార్డు నాయకులు టీడీపీ, జనసేన పార్టీ నాయకులపై కవ్వింపు చర్యలు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్ అక్కడి రావడంతో కూటమి నాయకులపై దాడికి యత్నించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. వాసుపల్లి పరిస్థితిని గమనించి అక్కడ నుండి ఉపక్రమించారు.

టీడీపీ నేతకు పోలీస్‌ల హెచ్చరికలు

మున్సిపల్ స్టేడియం వద్ద నిల్చున్న టీడీపీ వార్డు అధ్యక్షుడు బుచ్చారామిరెడ్డిని డీసీపీ హెచ్చరించారు. బైక్‌కోసం వచ్చానంటూ ఆయన సమాధానం చెబుతున్నా డీసీపీ వినలేదు. వన్‌టౌన్ సీఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశలో వాసుపల్లి వర్గం

మహారాణిపేట, మే 13: మహారాణిపేటలోని 29,30వ వార్డులలో ఓటర్లు కూటమికి అనుకూలంగా ఏకపక్షంగా ఓటు వేసినట్లు తెలుస్తోంది. ఈ రెండు వార్డులలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతుగా అత్యధికమంది ఓటు వేసినట్టు సమాచారం. వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్‌పై ఉన్న వ్యతిరేకత ఓటర్లలో కనిపించింది. అలాగే, నియోజక వర్గంలో గత పదేళ్లకు పైగా శాసనసభ్యుడిగా అనుభవం ఉన్నా ఈసారి పోలింగ్ సమయంలో చేతులు ఎత్తేయడంతో ఆపార్టీ వార్డు అధ్యక్షులు సహా కార్యకర్తలు నిరాశలో కూరుకుపోయారు. పోల్ మెనేజ్‌మెంట్‌లో పూర్తిగా వైఫల్యం చెందారు. వైసీపీ చెందిన వార్డు నాయకులు డబ్బులు కూడా సరిగా పంపిణీ చేయడంతో విఫలం కావడం ప్రజల్లో వాసుపల్లిపై వ్యతిరేకతకు మరింత కారణమైంది. దీంతో ప్రధాన నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద కనిపించలేదు. ఫలితంగా కార్యకర్తలకు టిఫిన్లు, భోజనాలు సంగతి కాదుకదా, తాగేందుకు మంచినీరు సైతం అందించే దిక్కులేకుండా పోయింది. ఈ ప్రతికూల పరిస్థితులన్నీ వాసుపల్లి ఓడిపోబోతున్నారేనేందుకు సంకేతమేనని పలువురు రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడ్డారు.

170 వ బూత్‌లో రాత్రి 9 వరకు పోలింగ్

మహారాణిపేట: 30వ వార్డులో 170వ బూత్‌లో రాత్రి తొమ్మిది గంటల వరకు ఓటింగ్ సాగింది. మధ్య వర్షం కురవటంతో ఓటింగ్‌కు కొంత అంతరాయం కలగడంతో ఓటర్లు పూర్తిస్థాయిలో ఓటుహక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు.



మున్సిపల్ స్టేడియం బూత్ వద్ద ఓటర్లు



సత్యసాయినగర్‌లో బారులు



నక్కవానిపాలెం జీవీఎంసీ పాఠశాల వద్ద క్యూ

ఓటు ఉత్సాహం



ఓటరు ఐడీ చూపుతున్న దృశ్యం

... 5వ పేజీ తరువాయి

తరలివచ్చినా పోలింగ్ మాత్రం మందకొడిగా సాగింది. రాత్రి పన్నెండు గంటలకు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం భీమిలిలో 71.14 శాతం, విశాఖ తూర్పులో 68.5 శాతం, విశాఖ దక్షిణలో 62.64, విశాఖ ఉత్తరంలో 61.52, పశ్చిమలో 65.05, గాజువాకలో 64.93 శాతం, పెందుర్తిలో 65.24 శాతం పోలింగ్ నమోదైంది.

ఉదయం నుంచి ఉత్సాహంగానే ఓటర్లు...

సోమవారం ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఉత్సాహంగా బారులు తీరారు. అయితే అనేకచోట్ల ఏడు గంటలకు పోలింగ్ మొదలుకాలేదు. ఈవీఎంలు పనిచేయక గంట నుంచి రెండు గంటలు ఆలస్యమైంది. అయినా ఓటర్లు గంటలకొద్దీ వేచిఉన్నారు. కొన్నిచోట్ల ఫ్యాన్లు పనిచేయకపోవడంతో ఉక్కపోతకు తడిసి ముద్దయ్యారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన 49 వేల మందికి ఓటు హక్కుకల్పించారు. వారంతా ఉత్సాహంగా ఓటువేశారు.

కొన్నిచోట్ల షామియానాల నుంచి ఓటర్లు క్యూ బయటకు రావడంతో ఎండకు ఇబ్బందిపడ్డారు. మరికొన్నిచోట్ల క్యూ ఒకచోట ఉంటే షామియానాలు మరోచోట వేశారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో అధికారులు ఒక విధానం పాటించలేదనే విమర్శలు వచ్చాయి. ఒకచోట 1000 మంది ఓటర్లకు ఒక కేంద్రం ఏర్పాటుచేస్తే, అక్కడక్కడా 500 మంది కంటే తక్కువ ఓటర్లకు ఒక కేంద్రం కేటాయించారు. ఇంకా కేంద్రాల కోసం ఎంపిక చేసుకున్న భవనాలు కొన్నిచోట్ల ఇరుకుగా ఉన్నాయి. దీంతో పురుషులు, మహిళలకు వేర్వేరుగా కాకుండా ఒకే లైను ఏర్పాటుచేశారు. దీంతో ఓటింగా బాగా ఆలస్యమైంది. పెదజాలారిపేటలో మహిళా మోడల్ పోలింగ్ కేంద్రం కోసం ఎంపిక చేసిన సామాజిక భవనం చిన్నది కావడంతో మహిళలు, పురుషులకు వేర్వేరు లైన్లు ఎండలో ఉండిపోవల్సి వచ్చింది. కొంతవరకూ ఏర్పాట్లు బాగానే ఉన్నా పోలింగ్ నిర్వహణలో పీవో నుంచి జిల్లా యంత్రాంగం వరకు విఫలమయ్యారని ఓటర్లు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఓటింగ్ నిర్వహణలో వేగవంతం లేకపోవడంతో సోమవారం రాత్రి 11 గంటల వరకు కొన్నిచోట్ల పోలింగ్ కొనసాగింది.

ఎవరి ధీమా వారిది!!

... 5వ పేజీ తరువాయి

ఘంటాపథంగా చెబుతోంది.

భీమిలిలో గంట మోగనుందా?

భీమిలి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. జిల్లాలో ఆయనకే ఎక్కువ మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తంచేస్తున్నారు. అయితే అదంతా ప్రచారమేనని వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి(అవంతి) శ్రీనివాసరావు గెలుపు ఖాయమని వైసీపీ పెద్దలు అంటున్నారు.

గాజువాకలో పల్లాకు మొగ్గు

గాజువాకలో వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు పరాభవమే మిగులుతుందని, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయం ఖాయమైపోయిందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. మంత్రిగా ఉండి అమర్‌నాథ్ జిల్లా ఏమీ చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి.

పశ్చిమంలో టైట్ ఫైట్

పశ్చిమ నియోజవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ జరిగింది. ఇక్కడ మూడోసారి ఎమ్మెల్యేగా గెలవాలని టీడీపీ అభ్యర్థి గణబాబు సర్వశక్తులు ఒడ్డగా, ఎలాగైనా విజయం సాధించి ఈసారి శాసనసభకు వెళ్లాలని వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గట్టి ప్రయత్నమే చేశారు. ఎక్కడా ఖర్చుకు వెనుకాడలేదు. మల్కాపురం, సింధియా తదితర పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఎవరికి అండగా నిలిస్తే వారే గెలుస్తారనేది టాక్. ఇద్దరిలో ఎవరు గెలిచినా అతి తక్కువ ఓట్ల మెజారిటీయే ఉంటుందని సమాచారం.

ఉత్తరంలో ఓట్లను చీల్చిన జైభారత్

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు గెలుపు కోసం హోరాహోరీ పోరాటం చేశారు. అయితే ఇక్కడ జైభారత్ పార్టీ తరఫున వీవీ లక్ష్మీనారాయణ పోటీలో నిలిచారు. ఆయన చీల్చే ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

విశాఖలో జనసేన జెండా రెపరెపలు

విశాఖ జిల్లాలో ఈసారి జనసేన జెండా ఎగురుతుందని ఆ పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి. దక్షిణ నియోజకవర్గంలో ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్ తొలుత కాసింత ఇబ్బంది ఎదుర్కొన్నా ఆ తరువాత బాగా పుంజుకున్నారు. టీడీపీ సహకారంతో పాటు వైసీపీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే వ్యతిరేకులు కలిసి రావడం అదృష్టంగా మారింది.

పెందుర్తిలో సామాజిక వర్గాల వారీగా చీలిక

పెందుర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ అభ్యర్థి అదీప్ రాజుల మధ్య నువ్వా?, నేనా? అనే పోటీ జరిగినట్టు చెబుతున్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో ఓటర్లు సామాజికవర్గాలకు ప్రాధాన్యమిస్తూ తమ వారికి అనుకూలంగా ఓటింగ్ చేశారు. అధికార పార్టీ అభ్యర్థిపై తీవ్రమైన భూకబ్జాల ఆరోపణలు ఉన్నందున అవే తనకి మైనస్‌గా మారాయని చెబుతున్నారు. పంచకర్లకు టీడీపీ నుంచి బలమైన సాయం ఉండటంతో జనసేనకి జై కొట్టిస్తారని అంటున్నారు.

ఈవీఎంల మొరాయింపు.. జనాలు అసహనం

- 36, 37 పీఎస్‌లలో రాత్రి పది వరకు ఓటింగ్
- అసహనంతో వెనుదిరిగి ఓటర్లు

మురళీనగర్, మే 13 ; మాధవధార, మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, బర్మాకాలనీ, ఆర్అండ్‌వీ జంక్షన్ పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. మాధవధార హైస్కూల్లోని 13 బూత్‌లో ఉదయంనుంచి హడావిడి కనిపించింది. మాధవధార హైస్కూలు సహా ప్రైమరీ, అపూర్వ పాత స్కూల్‌లలోని బూత్‌లకు ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 50 వార్డులోని 246 పీఎస్‌లో ఓటింగ్‌లో జాప్యం చోటుచేసుకోవడంతో బీజేపీ, వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు రిగ్గింగ్ జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. పోలీసు ఉన్నతాధికారుల రాకతో సమస్య కొలిక్కి వచ్చింది. మధ్యాహ్నం కూడా 50వవార్డు పీఎం 238లో వైసీపీ అభ్యర్థి కేకే రాజు గంట సమయానికి పైగా పోలింగ్ స్టేషన్‌లో తిష్ట వేయడంపై టీడీపీ వార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ఆయన్ని నిలదీశారు. సీతమ్మధారలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు గంటన్నర పాటు పోలింగ్ కేం ద్రం లో అనధికారికంగా కూర్చుని ఓటర్లని ప్రభావితం చేశారంటూ కేకే రాజు బదులిచ్చారు. ఎన్‌జీజీ ఓ ఎస్ కాలనీలోని 36, 37 పోలింగ్ స్టేషన్ల వద్ద ఈవీ ఎంలు మొరాయించినఉదయం 9 వరకు పోలింగ్ ఆరంభం కాలేదు. మధ్యలోని ఇబ్బంది పెట్టాయి. దీంతో చివరికి రాత్రి 10 వరకు ఈ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. రాత్రి 7 గంటలు దాటాక కూడా పరిస్థితి అదుపులోనికి రాకపోవడంతో కలెక్టరు ఎ.మల్లికార్జున బర్మాకాలనీలోని కేంద్రానికి చేరుకున్నారు. పీవోతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు, టీడీపీ నార్త్ ఎన్నికల పరిశీలకులు నజీర్ తదితరులు కేంద్రంలో సమస్యల్ని పరిష్కారమయ్యేవరకు అక్కడే ఉన్నారు. ఓటర్లు అసెంబ్లీ, ఎం పీ అభ్యర్థులకు ఒకే ఈవీఎంలని భావించి వాటి బటన్‌లు పదే పదే నొక్కడంతో సమస్య తలెత్తినట్లు అధికారులు తెలిపారు. పీఎస్ 36, 37 లో ఓటింగ్ రాత్రి 8 దాటాక కొనసాగింది. ఈ కేంద్రాన్ని కలెక్టర్ పర్యవేక్షిస్తున్న సమయంలో విద్యుత్ అంతరాయం తలెత్తడంతోపాటు వర్షం రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో చాలామంది అసహనంతో కేంద్రం వీడి ఇళ్లకు వెళ్లిపోయారు. కలెక్టర్ ఎదుట పలువురు అసహనం వ్యక్తంచేశారు. ఈ కేంద్రాల్లో 10 గంటల దాటిన వ రకు పోలింగ్ సాగింది.



బర్మాకాలనీ 36 పీఎస్ వద్ద సమీక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు, ఇతరులు



బర్మాకాలనీ కేంద్రంలో రాత్రి 9 గంటలకు బారులు తీరిన ఓటరు

సీబీఎస్‌ఈ ఫలితాల్లో శ్రీ చైతన్య విజయభేరి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మహారాణిపేట, మే 13: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాలలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ అద్భుత ఫలితాలు సాధించారు. విశాఖ కు చెందిన పి.హర్షవర్ధన్ అనే విద్యార్థి 500 మార్కులకు గాను 493 మార్కులను సాధించి చరిత్ర తిరగ రాసినట్లు సంస్థ ఏజీఎం ఎంవీ సురేష్ తెలిపారు. 485 పైగా ఐదుగురు విద్యార్థులు, 480కు పైగా మార్కులతో 13 మంది విద్యార్థులు సం చ లనం సృష్టించారని తెలిపారు.అలాగే, 450 మార్కులు సాధించిన వారు 95 మంది ఉన్నారన్నారు. ఈ రికార్డు సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు అభి నందనలు తెలిపారు.

శ్రీ ప్రకాష్ ప్రభంజనం

సీతమ్మధార, మే 13: సీబీఎస్‌ఈ పది, పన్నెండో తరగతుల పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల యాజమాన్యం తెలిసింది. పదో తరగతి 484, పన్నెండో తరగతిలో 459 అత్యధిక మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. పదిలో 255 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 62 మంది విద్యార్థులు 90 శాతంపైగా మార్కులు సాధించినట్లు తెలిపారు.

పన్నెండో తరగతిలో 44మంది విద్యార్థులు హాజరుకాగా, ఐదుగురు వి ద్యార్థులు 90శాతం పైగా మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ అభినందించారు.

డా.కూటికుప్పలకు ఎండోమెంట్ పురస్కారం



.కూటికుప్పలను అభినందిస్తున్న అతిథులు

కంచరపాలెం, మే 13:ప్రముఖ వైద్యుడు డా.కూటికుప్పల సూర్యారావుకు ప్రతిష్టాత్మక డా.ఎ.హడింగాల్ ఎండోమెంట్ పురస్కారం లభించింది. ఈ నెల 10వ తేదీ నుంచి బెంగళూరులో జరుగుతున్న 16వ అంతర్జాతీయ సోషల్ ఫిలాసఫీ, 10వ యోగా, ఆధ్యాత్మిక శాస్త్రం తదితర అంశాలపై సదస్సులో భాగంగా డా.సూర్యారావుకు ఈ పురస్కారాన్ని అతిథులు అందజేశారు. ఆచార్య యఘ్నేశ్వర్ శాస్త్రి అధ్యక్షతన జరిగిన సదస్సులో డా.కూటికుప్పల తన ఉపన్యాసాన్ని అందించారు. సదస్సులో శారీరక, మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను వివరించారు. ఈ సదస్సులో హిజ్ హోలీనల్ శ్రీ శాంతా భీష్మ చౌడయ్య స్వామిజీ, డా.అరుధాభారతి స్వామిజీ, ప్రొ.వై.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎండలో బారులు..

(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గ పరిధిలో అనేక పోలింగ్ కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లులేక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధురవాడ, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో బూత్‌ల ఎదుట టెంట్లు ఉన్నా అవి చాలక ఎండలో నిరీక్షించాల్సి వచ్చింది. దాహం వేసినా నీళ్ల ఇచ్చే వాళ్ల లేకపోవడంతో అలసిపోయారు. కొంతమంది వెనక్కి ఇంటికి వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చారు. తొలిసారి ఓటు హక్కు వేసిన యువత ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఆ ఫొటోలను వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ 'నేను ఓటేశాను.. మీరూ వేయండి' అన్న హ్యాష్ ట్యాగ్‌లతో పోస్టులు చేశారు.

తీర ప్రాంతంలో భారీ వర్షం

సాగర్‌నగర్, మే 13 : సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆరు గంటల తరువాత ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై కారు మబ్బులు కమ్మి గంట పాటు వర్షం పడింది. అలాగే గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. పోలింగ్ పూర్తయిన తరువాత వర్షం పడడంతో పోలింగ్ అధికారులు, సిబ్బంది, ఓటర్లు ఊపిరిపీల్చుకున్నారు.

వెంకోజీపాలెం : అకాల వర్షంతో 16వ వార్డులోని ఇసుకతోట రజక వీధి వద్ద గెడ్డ కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రోడ్లు నీట మునిగాయి. దీంతో 264, 265 బూత్‌లకు ఆలస్యంగా వచ్చిన ఓటర్లు తిరిగి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు.

హనుమత్ వాహనంపై అప్పన్నస్వామి



సింహాచలం, మే 13 : చక్రవర్తి తిరుమగన్ (శ్రీరామ) తిరు నక్షత్ర పూజలు వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏటా అప్పన్న సన్నిధిలో శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి మేషమాస పునర్వసు రోజున చక్రవర్తి తిరుమగన్ తిరు నక్షత్ర పూజలు చేయడం ఆనవాయితీ. ఈమేరకు ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజాస్వామిని ఉభయ దేవేరులతో ఆలయ ఆస్థాన మండపంలో రజిత సింహాసనంపై అధిష్ఠింపజేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహ వచనములు చేసిన తరువాత పంచామృతాలతో స్వామికి అభిషేకించారు. ఈ సందర్భంగా రామాయణంలోని శ్రీరామ జననం ఘట్టం పారాయణ చేసి సీతారామ కల్యాణాన్ని వేడుకగా జరిపారు. సాయంత్రం స్వామివారిని హనుమత్ వాహనంపై అధిష్ఠింపజేసి సింహగిరి మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా జరిపారు.

సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, మే 13 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయంగా సింహగిరిపై గంగధార వద్ద కొలువుదీరిన సీతారామస్వామి సన్నిధిలో రాముడి ఆవిర్భావ నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని సోమవారం సంక్షిప్త రామాయణ హవనం నిర్వహించారు. ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి సతీసమేతంగా హాజరుకాగా అర్చకులు ఐవి పద్మహాస చక్రవర్తి తదితరులు ఉత్సవమూర్తిని లక్ష్మణ, సీతా, హనుమత్ సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్ఠించారు. లోకకల్యాణార్థం అన్న సంకల్పంతో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి సంక్షిప్త రామాయణ, శ్రీరామ షడక్షరీ మంత్ర పఠనాలతో హవనాన్ని జరిపి పూర్ణాహుతి సమర్పించారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహాచలం, మే 13 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో తిరుకల్యాణోత్సవం, నిజరూప దర్శనం కారణంగా నిలుపుదల చేసిన ఆర్జిత సేవలు సోమవారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. ఈమేరకు సోమవా రం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

లేగ దూడల సంరక్షణకు చర్యలు

సింహాచలం, మే 13 : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు కొండదిగువ తొలిపావంచా వద్ద సమర్పించే గోసంతతికి చెందిన దూడల సంరక్షణకు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు ఈఈ బండారు రాంబాబు సారథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండ, వాన నుంచి రక్షణగా తాటాకులతో గుడిసే నిర్మించారు. అలాగే తాగునీటి సిమ్మెంటు తొట్టెలు ఉంచి వాటిలో నీటిని ఏర్పాటు చేశారు. లేగ దూడలకు ఎల్ల వేళల గ్రాసం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్టు అధికారులు చెప్పారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 23, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 34, క్యాబేజ్ 26, క్యారెట్ 36, దొండకాయలు 27, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 150, బరబటి 46, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 98, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 44, కీరదోస 30, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 66, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 130
ఫారం ధర	-- 150
విత్ స్కిన్	-- 270
స్కిన్‌లెస్	-- 280

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



ఎంవీపీ కాలనీలో కుటుంబ సభ్యుతో కలిసి ఓటు వేసిన వెలగపూడి



ఎంవీపీ కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన గంటా



భీమిలిలో తన అనుచరులతో కలిసి ఓటు వేసిన ముత్తంశెట్టి

ప్రశాంతంగా పోలింగ్

- ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- మొదటి రెండు గంటలు మొరాయించిన ఈవీఎంలు
- పలు కేంద్రాలను సందర్శించిన బరిలో ఉన్న అభ్యర్థులు

భీమునిపట్నం, మే 13 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మొదట్లో ఈవీఎంల మొరాయింపు వల్ల పోలింగ్ మందకొడిగా జరిగినా, తర్వాత ఊపందుకుంది. మధ్యాహ్నం భోజన సమయంలో కొద్దిగా మందకొడిగా జరిగినా, మూడున్నర నుంచి ఓటర్లు భారీగా తరలివచ్చారు. నియోజకవర్గ పోలీస్ ఇన్‌ఛార్జి గౌతమి శాలి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు 7.91 శాతం, 11 గంటలకు 21.80 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 32.61శాతం, 3 గంటలకు 48.98 శాతం, 4 గంటలకు 51.03 శాతం, 5 గంటలకు 60.67 శాతం పోలింగ్ జరిగినట్టు అధికారులు తెలిపారు. భీమిలి సెంట్రల్ ఎక్సైజ్ కార్యాలయంలోనూ, యాతకుమ్మరిపాలెం జీవీఎంసీ ఎలిమెంటరీ పాఠశాలలోనూ, జీవీఎంసీ ఎంఎఫ్‌సీ ప్రాథమికోన్నత పాఠశాల, రేఖవానిపాలెం మండల ఎంపీపీ పాఠశాలలోనూ ఈవీఎంలు మొరాయించాయి.దీంతో ఆయా బూత్‌ల్లో పోలింగ్ ఆలస్యంగా జరిగింది. పలు బూత్‌ల్లో మహిళలకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులకు గురయ్యారు. కాపులుప్పాడ, చేపలుప్పాడ, పట్టణంలోని ఎంఎఫ్‌సీ పాఠశాల, సీబీఎం హైస్కూలు, యాతకుమ్మరిపాలెం, నాగమయ్యపాలెం, చిట్టివలసలోని డా బీఆర్ అంబేడ్కర్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సమయం దాటినా పోలింగ్ జరిగింది. సాయంత్రం కురిసిన వర్షంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.

భీమిలిలో ఓటు వేసిన ముత్తంశెట్టి

భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్థానిక సీబీఎం ఎయిడెడ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 175 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే బూత్‌లో ముత్తంశెట్టి మహేష్ శేఖర్ కూడా ఓటు వేశారు. బూత్ నంబరు 174లో ఎమ్మెల్యే శ్రీనివాసరావు సతీమణి జ్ఞానేశ్వరి, కుమార్తె, 6వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక, తనయుడు ఎం. నందీశ్‌బాబు, అల్లుడు శ్రవణ్ కుమార్ ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకట వర్మ తన ఓటును రేఖవానిపాలెంలో పోలింగ్ బూత్‌లోనూ, బీఎస్పీ అభ్యర్థి భాగం గోపాలరావు తన ఓటును యాతకుమ్మరిపాలెం జీవీఎంసీ పాఠశాలలోనూ వేశారు.

రాత్రి 8 వరకూ కొనసాగిన పోలింగ్

భీమిలి నియోజకవర్గంలో పలుచోట్ల రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడం, ఎన్నికల సిబ్బంది పోలింగ్ త్వరితగతిన జరిగేలా చూడలేక పోవడంతో మందకొడిగా పోలింగ్ జరిగిందన్న వాదన వినబడుతుంది. భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ ఆఫీసులో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 171లో రాత్రి ఎనిమిది గంటల వరకు 200 మంది ఓటర్లు క్యూలో ఉన్నారు. 4వ వార్డు పెద ఉప్పాడ సచివాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌లో కూడా రాత్రి 8 గంటల తర్వాత సుమారు 400 వరకూ ఓటర్లు లైన్‌లో ఉన్నారు. పెద ఉప్పాడలో భారీ వర్షం కురుస్తుండడంతో ఓటర్లు గొడుగులు వేసుకుని మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. భీమిలి సీబీఎం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 176 బూత్‌లోనూ, యాతకుమ్మరిపాలెం 172, 173 బూత్‌లోనూ ఓటర్లు క్యూ కట్టారు. చిట్టివలస సంతపేట డా. బిఆర్ అంబేద్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో కూడా సుమారు 200 మంది క్యూలో వున్నారు. ఆర్‌ఓ భాస్కర్‌రెడ్డి పెద ఉప్పాడలో వుండి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూస్తున్నారు.

ఉదయం నుంచే బారులు

కొమ్మాది, మే 13 : మధురవాడ ప్రాంతంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుండే ప్రజలు ఓటు వేయటానికి బూత్‌ల వద్ద బారులు తీరారు. ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా.. క్యూలో నిలబడి ఓటుహక్కు వినియోగించుకున్నారు. పీఎంపాలెం, చంద్రంపాలెం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఎక్కువ సేపు క్యూలో ఉండాల్సి వచ్చింది. కొన్నిచోట్ల షామియానాలు సరిగ్గా లేకపోవడంతో ఓటర్లు ఎండ వేడిమికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు కొమ్మాది, సాయిరాంకాలనీ, పీఎంపాలెం గాయత్రినగర్, చంద్రంపాలెం హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు చంద్రంపాలెం హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించినప్పుడు ఆయనతో పాటు ఆ పార్టీ శ్రేణులు కూడా లోపలికి వెళ్లడానికి ప్రయత్నించినప్పుడు అక్కడ ఉన్న పోలీస్ అధికారులు అడ్డుకోవడంతో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ పరిసర ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 95, 109 పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఎంవీపీ తొమ్మిదో సెక్టరు వాసవానిపాలెం సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ 95లో సాయంత్రం ఆరు గంటలకు అధిక సంఖ్యలో ఓటర్లు బారులు తీరి ఉండడంతో ఓటింగ్ కొనసాగించారు. రాత్రి ఏడున్నరకు వంద మంది క్యూలో ఉన్నారు. 109, 110, 111,112, 113 బూత్‌ల్లో ఉదయం నుంచీ ఓటింగ్ సరళి నెమ్మదిగా కొనసాగింది. 118 కేంద్రంలో పోలింగ్ అధికారికి ఒక్కసారిగా షుగర్ లెవెల్స్ పడిపోవడంతో వాంతులయ్యాయి. 108 వాహనంలో అతనికి ప్రాథమిక వైద్యం అందించారు. 95 బూత్‌లో జరిగిన పోలింగ్ సరళిని రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ పరిశీలించారు.

సాగర్‌నగర్‌లో 67.9 శాతం

సాగర్‌నగర్ : సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండ ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.సాగర్‌నగర్‌లోని మేరీస్టెల్లాలో ఏర్పాటు చేసిన బూత్‌ల వద్ద ఉదయం 7 గంటల నుండే ఓటర్లు బారులు తీరారు.ఇక్కడ ఐదు బూత్‌ల్లో 5 వేల మంది ఓటర్లు ఉండగా 345 బూత్‌లో 731 ఓట్లు, 344 బూత్‌లో 699 ఓట్లు, 343 బూత్‌లో 767, 342 బూత్‌లో 591, 342ఎ బూత్‌లో 608 ఓట్లు నమోదయ్యాయి. మొత్తం పోలింగ్ 67.9శాతం నమోదైంది. గుడ్లవానిపాలెం ప్రభుత్వ పాఠశాలలో సాయంత్రం 6 గంటల తరువాత కూడా ఓటర్లు ఉండడంతో పోలింగ్ కొనసాగించారు.దీనికితోడు వర్షం ప్రారంభమైనప్పటికీ ఓటర్లు ఓటు వినియోగించుకున్నారు. ఇక్కడ ఉన్న 341 బూత్‌లో 1400 ఓట్లకు 900 పోలయ్యాయి. రుషికొండ, వాడపాలెం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బూత్ నెంబర్ 346లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ సాగింది. 348ఎ బూత్‌లో 1020 ఓట్లకు గాను 707 ఓట్లు పోలయ్యాయి. 348 బూత్‌ల్లో 770 ఓట్లకు 550, 347 బూత్‌లో 1109 ఓట్లుకు 796 ఓట్లు పోలయ్యాయి. రుషికొండలోని బూత్‌లో అరగంట పాటు ఈవీఎం మొరాయించింది.

కృష్ణ కళాశాల వద్ద వైసీపీ నాయకుల ప్రచారం

మద్దిలపాలెం : ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, కృష్ణ కళాశాల కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇంజినీరింగ్ కళాశాల, మద్దిలపాలెం కృష్ణ కళాశాలల్లో 32 బూత్‌ల్లో పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. కృష్ణ కళాశాల బయట వైసీపీ నాయకులు ఓటర్లను ప్రభావితం



ఆనందపురంలోని గిడిజాలలో సమయం దాటినా క్యూలో ఉన్న ఓటర్లు

చేసేలా ప్రచారం చేశారు. ఫ్యాన్‌కు ఓటేయాలని కేకలు వేస్తూ రచ్చ చేశారు. రోడ్డు మీద అడ్డంగా వచ్చి ఓటర్లను నిలిపి ప్రచారం చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. కూత వేటు దూరంలో పోలీసులున్నప్పటికీ నిలువరించే ప్రయత్నం చేయలేదు. పోలింగ్ బూత్‌లకు చాలా దూరంలో వాహనాలు నిలిపివేశారు. దీంతో ఓటర్లు దూరంగా నడిచివెళ్లే పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు, వికలాంగులను మాత్రం పోలింగ్ కేంద్రం వరకు ఆటోలో పంపించే ఏర్పాటు చేశారు. అరవై ఏళ్లు దాటిన వృద్ధులు, చిన్న పిల్లల తల్లులు, గర్భిణిలకు క్యూతో సంబంధం లేకుండా ఓటేసే ఏర్పాటు చేశారు. సాయంత్రం స్థానిక వైసీపీ కార్పొరేటర్ మొల్లి లక్ష్మీ భర్త అప్పారావు 238 బూత్‌లో హల్‌చల్ చేశారు. ఓటేయడానికి వెళ్లిన ఆయన బూత్‌లోనే ఉండిపోవడంతో టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన్ను బయటకు పంపాలని గొడవ చేయడంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వివాదం తలెత్తింది. పోలీసులు అప్పారావును బయటకు పంపడంతో వివాదం సద్దుమణిగింది.

98వ వార్డులో...

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులోని 234, 215, 219, 236 కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. దీంతో సాయంత్రం పోలింగ్ సమయం ముగిసినా మరో గంట పాటు ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. 232, 215 బూత్‌ల ముందు టెంట్లు వేయకపోవటంతో ఓటర్లు ఎండలో ఇబ్బందులు పడ్డారు. కొందరు వృద్ధులు సహాయకులతో కలిసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 236 పీఎస్‌లో ఈవీఎం పలుమార్లు మొరాయించడంతో ఇబ్బంది పడిన ఓటర్లు విసుగుచెంది ఓటు వేయకుండానే వెనుదిరిగారు. కాగా పోలింగ్ బూత్‌ల వద్ద అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు 98వ వార్డులోని 234 బూత్‌లోకి వెళ్లి ఓటింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. గంటాతో 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, భీమిలి టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ఉన్నారు. కాగా పోలింగ్ ప్రారంభం వేళ తమ ఆరాధ్యదైవం వరాహలక్ష్మీనృసింహస్వామిని గంటా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పివి నరసింహం, 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్‌లతో, పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, జబర్దస్త్ ఫేమ్ అడివివరం గ్రామానికి చెందిన ఆటో రామ్‌ప్రసాద్, అడివివరం సొసైటీ ఉపాధ్యక్షుడు బంటు బిల్లి మహేష్‌తో కలిసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

మొరాయించిన ఈవీఎంలు

ఆరిలోవ : ఆరిలోవలో పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. తోటగరువు హైస్కూలులోని 48 బూత్‌లో ఉదయం 10-30కి 111 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. సుమారు మూడు గంటల పాటు ఓటర్లు క్యూలో పడిగాపులు కాసారు. అలాగే దీనదయాళపురంలోని ఆరవ బూత్‌లోనూ ఇదే సమస్య తలెత్తింది. 69వ బూత్ వద్ద కూడా మధ్యాహ్నం వరకు ఈవీఎంలు నెమ్మదిగా పని చేశాయి. 38 బూత్‌లో సాయంత్రం 5 గంటలకు ఈవీఎంలు మొరాయించాయి. కాగా గాంధీనగర్‌లో ఒక కానిస్టేబుల్ వైసీపీకి ఓటు వేయమని ప్రచారం చేస్తున్నట్టు టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే గాంధీనగర్‌లో పోలింగ్ ఏజెంట్‌గా వలంటీర్‌ను నియమించినట్టు టీడీపీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వలంటీరును తక్షణమే విధుల నుంచి తొలగించారు. కాగా సాయంత్రం ఆరు గంటల తరువాత నాగేశ్వరరావుపేట బూత్‌లో 500 మంది, ఎస్‌ఐజీ నగర్‌లోని 68. 69 బూత్‌ల్లో 200 మంది, ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలోని 23, 24 బూత్‌ల్లో 700 మంది క్యూలో ఉన్నారు. రాత్రి 10 గంటల వరకు ఆయా బూత్‌ల్లో పోలింగ్ కొనసాగింది.

ఓటర్ల అసహనం

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డులోని పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. చాలామంది అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

ఆనందపురంలో రాత్రి పది వరకు కొనసాగిన పోలింగ్

ఆనందపురం : మండలంలోని 26 పంచాయతీల్లోనూ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇక్కడ ఉన్న 107 పోలింగ్ బూత్‌ల్లోనూ ఈవీఎంలు మొరాయించడంతో సగానికిపైగా కేంద్రాల్లో రాత్రి పది గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల్లోను వచ్చిన వారికి టోకెన్లు, ఆ తరువాత వచ్చిన వారిని ఓటు వేయడానికి అంగీకరించలేదు. సాయంత్రం ఆరు తరువాత కురిసిన వర్షానికి గంట పాటు విద్యుత్‌కు అంతరాయం కలగడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పోలింగ్ నిర్వహించారు. మండలంలో మొత్తం 50,582 మంది ఓటర్లు ఉండగా 38520 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వెల్లంకి, ఆనందపురం, గంభీరం పంచాయతీల్లో జరిగిన పోలింగ్‌ను కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీభరత్, గంటా శ్రీనివాసరావు పరిశీలించారు.

బూత్‌ల మార్పిడితో ఇబ్బందులు

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15, 16 వార్డుల్లో రాత్రి 8 వరకు పోలింగ్ జరిగింది. 36, 274, 275 బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు గంట పాటు ఓటింగ్ ప్రక్రియ చేపట్టలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే రీతిలో ఓటర్లు బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 278, 264, 265, 271, 272 బూత్‌ల్లో ఆరు దాటినా పోలింగ్ జరిగింది. ఆరు గంటల్లోపు వచ్చిన వారికి స్లిప్‌లు అందజేసి ఓటు వేయించారు. 270, 271 బూత్‌లను గతంలో జేఆర్‌నగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఇప్పుడు ఆ స్కూల్ రెనోవేషన్ కారణంగా ఇసుకతోట ప్రాథమిక పాఠశాలకు మార్చడంతో దీనికి సంబంధించిన ఓటర్లు కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అన్ని బూత్‌ల్లోనూ 75 నుంచి 80 శాతం వరకు పోలింగ్ జరగడంతో టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెదవాల్తేరు : పెద్దజాలరిపేటలో ఓటింగ్ నత్తనడకన సాగింది. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పెద్దజాలారిపేటలో మొత్తం ఓటర్లు 10,472 మంది కాగా సాయంత్రానికి 7400 ఓట్లు పోలయ్యాయి.



కృష్ణా కళాశాల వద్ద ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ



ఎండాడలో ఓటు వేయడానికి వృద్ధురాలిని తీసుకువెళుతున్న స్థానికులు



గుడ్లవానిపాలెం బూత్ వద్ద ఉదయం 7 గంటలకు ఇదీ ! పరిస్థితి



మద్దిలపాలెం : కృష్ణా కళాశాల వద్ద బారులు తీరిన ఓటర్లు



ఎండాడలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ప్రజలు



కొమ్మాది కేంద్రంలో క్యూలైనులో ఉన్న ఓటర్లతో మాట్లాడుతున్న గంటా



తాళ్లవలసలో బూత్ నంబరు 171లో రాత్రి 8 గంటలకు క్యూలో ఉన్న ఓటర్లు



ఎంవీపీలోని ఓ పోలింగ్ బూత్‌ను సందర్శిస్తున్న వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ



భీమిలి పట్టణంలోని ఓ కేంద్రంలో బారులు తీరి ఉన్న ఓటర్లు



సింహాచలంలో ఓ పోలింగ్ బూత్ వద్ద టెంట్లు లేక ఎండలో ఓటర్ల అవస్థలు



పద్మనాభం : పాండ్రంగిలో ఉదయం 7 గంటలకు క్యూలో ఉన్న ఓటర్లు